www.visalaandhra.com

శనివారం
15-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 292
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

శక్తిమంతమైన ఖండాంతర క్షిపణిని పరీక్షించిన ఉ.కొరియా

అత్యంత శక్తిమంతమైన కొత్త సాలిడ్-ఫ్యూయల్ ఖండాంతర క్షిపణి(ఐసీబీఎం) 'హ్వాసాంగ్-18'ని ఉత్తర కొరియా ప్రయోగించింది. దేశ అణ్వాయుధ శక్తిని మరింత పెంచుకునే దిశగా ఉత్తర కొరియా అడుగులు వేస్తోంది. ఈ మేరకు 'ది కొరియన్ సెంట్రల్ న్యూస్' ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది.

2లో

బీజేపీని సాగనంపుదాం

- హిందుత్వ కార్పొరేట్ కూటమే మోదీ లక్ష్యం
- అదానీకి దేశ సంపద ధారాదత్తం
- ఫాసిస్టు సిద్ధాంతాల అమలు
- అంబేద్కర్ కోసం బీజేపీ, ఆరెస్సెస్ తపన
- సీపీఐ, సీపీఎం జాతీయ నేతలు వినయ్ విశ్వం, ప్రకాశ్ కారత్
- మోదీ ప్రజావ్యతిరేక విధానాలపై 'ప్రచారభేరి' ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:

లౌకిక, ప్రజాతంత్ర, వామపక్ష శక్తులన్నీ ఏకమైతే 2024 ఎన్నికల్లో బీజేపీని సాగనంపడం ఖాయమని, ఇందుకు ఐక్య ఉద్యమాలు అవశ్యమని, రాజకీయ పార్టీలు ఆయా రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా ఏకతాటిపైకి రావాల్సిన అవసరముందని సీపీఐ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు వినయ్ విశ్వం, సీపీఎం కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యుడు ప్రకాశ్ కారత్ పిలుపునిచ్చారు. దేశంలో బడా పారిశ్రామిక రాజ్యాన్ని మోదీ ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోందని, దీనికి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల ఐక్యఉద్యమాలు రావాలన్నారు. 'ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీ-మోదీని సాగనంపుదాం, దేశాన్ని కాపాడుకుందామ'నే నినాదంతో సీపీఐ, సీపీఎం సంయుక్తంగా బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా చేపట్టిన ప్రచారభేరి సభ విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగింది. ప్రచారభేరి సభకు అధ్యక్షవర్గంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు వ్యవహరించారు. వినయ్ విశ్వం మాట్లాడుతూ విజయవాడకు రాగానే కమ్యూనిస్టు అగ్రనేతలు చంద్ర రాజేశ్వరరావు, మాకినేని బసవపున్నయ్య, పుచ్చలపల్లి సుందరయ్య నేతృత్వం వహించిన ఉద్యమాలు, తెలంగాణ పోరాట ఘటనలు గుర్తుకు వస్తాయన్నారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న హిందుత్వ సిద్ధాంతానికి భిన్నమైన సిద్ధాంతం కమ్యూనిస్టుల దగ్గర ఉందన్నారు. మనకు మార్క్సిజం సిద్ధాంతం గొప్ప ఆయుధమని, వామపక్షాలు మార్క్సిజం సిద్ధాంతాన్ని అవలోకనం చేసుకొని ముందుకు నడవాలన్నారు. ఈ సిద్ధాంతాలను కొందరు వెక్కిరించడాన్ని తప్పుపట్టారు. మార్క్సిజమనేది ఒక శాస్త్రమని, కమ్యూనిస్టు మేనిఫెస్టోలో ఈ శాస్త్రాన్ని వివరించారంటూ విశ్లేషించారు. కార్ల్‌మార్క్స్ చెప్పినట్లుగా పెట్టుబడి అనేది మొత్తం అందర్నీ తన బానిసలుగా చేస్తుందని, పెట్టుబడి విస్తరిస్తున్న కొద్దీ ఒక ఉద్యోగి, ఒక రచయిత ఇలా ఎవరైనా సరే...దానికి బానిసగా మారాల్సిందేనన్నారు. మోదీ ప్రభుత్వ విధానాలు అవేనన్నారు. తుదకు ప్రధాని మోదీ సైతం అదానీ అనే పెట్టుబడిదారుడికి బానిసగా మారిపోయారని ఎద్దేవా చేశారు. బీజేపీ నాయకులు అన్ని విషయాలు మాట్లాడతారుగానీ...అదానీ సంపద ఎలా పెరిగిందనే దానిపై నోరు విప్పడం లేదని విమర్శించారు. ఆ విషయం వచ్చినప్పుడు మైనమే సమాధానంగా ఉంటుందన్నారు. ఆ నిశబ్దం వెనుక ఒక సిద్ధాంతం దాగి ఉందని, అదే ఫాసిజమని, ఆ ఫాసిస్టు సిద్ధాంతంతో దేశాన్ని పాలించేందుకు మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. బీజేపీ, ఆరెస్సెస్ నేతలు అంబేద్కర్ గురించి మాట్లాడతారుగానీ...ఆయన చెప్పిన సిద్ధాంతాల్ని అనుసరించడం లేదన్నారు. హిందూరాజ్యం అనేది దేశ విధానం కాదని అంబేద్కర్ నొక్కిచెప్పారని, దానికి విరుద్ధంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఆరెస్సెస్, బీజేపీది సొంత సిద్ధాంతం కాదని, అది భారతదేశ ఫాసిస్టు సిద్ధాంతమని చెప్పవచ్చన్నారు. విదేశీ పెట్టుబడులపై ఆధారపడిన వీళ్ళు భరతమాతను ఎలా ఉద్ధరిస్తారని ప్రశ్నించారు. ఫాసిస్టు సిద్ధాంతాలను సవాల్ చేసే శక్తి కమ్యూనిస్టు సిద్ధాంతాలకే ఉందని పునరుద్ఘాటించారు. అవినీతి మచ్చలేని వారుగా కమ్యూనిస్టులున్నారని, వారికి ఈడీ, ఐటీ, సీబీఐ అంటే భయం ఉండబోదని స్పష్టం చేశారు. సీపీఐ, సీపీఎం ఎన్నికల కమిషన్ ఇచ్చే సర్టిఫికెట్లతో పనిచేయడం లేదని, ప్రజాపోరాటాలతో ప్రజలిచ్చిన సర్టిఫికెట్లతో ఈ పార్టీలు కొనసాగుతున్నాయని నొక్కిచెప్పారు. కమ్యూనిస్టుల ఐక్యత అత్యవసరమని, ఈ ఐక్యత కోసం ప్రతి సమస్యపైనా ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, ప్రజాసంఘాలు కలిసి పనిచేయాలని పునరుద్ఘాటించారు.

ప్రకాశ్ కారత్ ప్రసంగిస్తూ బీఆర్ అంబేద్కర్‌ను సొంతం చేసుకునేందుకు బీజేపీ, ఆరెస్సెస్ శక్తులు ప్రయత్నిస్తున్నాయన్నారు. 70 ఏళ్లుగా లౌకికపార్టీలు రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటూ వచ్చాయని, స్వాతంత్ర్య పోరాటంలో మన పూర్వీకుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న విలువల్ని రాజ్యాంగంలో అంబేద్కర్ చేర్చి పరిరక్షించారని గుర్తుచేశారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అన్ని లక్షణాలను రాజ్యాంగం పుణికిపుచ్చుకుందని, ఈ రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్...కుల తత్వానికి వ్యతిరేకంగా, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తి అని, మనువాద విలువల్ని ఆయన వ్యతిరేకించారని గుర్తుచేశారు. మోదీ ప్రభుత్వం మనువాదం ఆధారంగా రాజ్యాంగాన్ని మార్చడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఆరెస్సెస్, బీజేపీ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని, 1925లో ఆరెస్సెస్ ఏర్పడినప్పుడు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకు రాలేదని గుర్తుచేశారు. ఆరెస్సెస్ ముస్లిములకు వ్యతిరేకంగా పోరాడుతుందని, భారత రాజ్యాంగాన్ని ఆరెస్సెస్ అంగీకరించలేదని, రాజ్యాంగం లౌకిక ప్రజాస్వామ్య విధానంలో ఉండకూడదనేది వారి నిరంకుశ వాదనని, హిందూ రాజ్యంగా భారత రాజ్యాంగం ఉండాలనేది వారి కోరికని ధ్వజమెత్తారు. ప్రత్యేకించి మోదీ అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ రాజ్యాంగాన్ని మనుస్మృతి ఆధారంగా హిందూ రాజ్యాంగంగా మార్చేందుకు కుట్ర చేస్తున్నట్లు దుయ్యబట్టారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారం స్వీకరించిన వారే...ఆ రాజ్యాంగాన్ని వమ్ము చేసి దానిస్థానంలో హిందుత్వ రాజ్యాంగం

- మిగతా 2 లో

విశాఖ ఉక్కుపై

కేంద్రం మళ్లీ యూటర్న్

ప్రైవేటీకరణ ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టీకరణ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంలో కేంద్రం 24 గంటల వ్యవధిలోనే మళ్లీ మాట మార్చింది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయడం లేదంటూ స్వయంగా కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే ప్రకటించిన మరుసటి రోజే ప్రైవేటీకరణ ఆపేది లేదంటూ కేంద్రం స్పష్టం చేసింది. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను నిలుపుదల చేసినట్లు వస్తున్న వార్తలను కేంద్రం ఖండించింది. స్టీల్‌ప్లాంట్‌లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేసింది. స్టీల్‌ప్లాంట్ పని తీరు మెరుగుకు ప్రభుత్వం, ఆర్ఐఎన్ఎల్ తమ వంతు కృషి చేస్తున్నాయంటూ

- మిగతా 2 లో

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి: రామకృష్ణ

2లో

కేంద్రం తీరుపై ఉక్కు కార్మికుల ఆగ్రహం

మోదీ దిష్టిబొమ్మ దహనం

2లో

అంబేద్కర్ విశ్వమానవుడు

- ఇది విగ్రహం కాదు... విప్లవం
- అంబేద్కర్ పేరిట అవార్డులు
- 2024లో వచ్చేది మన రాజ్యమే
- హైదరాబాద్‌లో అంబేద్కర్ భారీ విగ్రహావిష్కరణ సభలో సీఎం కేసీఆర్

విశాలాంధ్ర–హైదరాబాద్ :

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్. అంబేద్కర్ విశ్వమానవుడని బీఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. ఆయన సిద్ధాంతం విశ్వజనీనం, సార్వజనీనమని తెలిపారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్ హుసేన్ సాగర్ తీరాన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రతిష్ఠించిన 125 అడుగుల అంబేద్కర్ భారీ విగ్రహాన్ని సీఎం కేసీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశంలోనే కాకుండా ప్రపంచానికి కూడా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఒక దిక్సూచి అని తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగం అమలులోకి వచ్చి 70 ఏళ్లు దాటిందని, ఎవరో అడిగితే అంబేద్కర్ విగ్రహం పెట్టలేదన్నారు. విశ్వమానవుడి విశ్వరూపం ప్రతిష్ఠించుకున్నామని, సచివాలయానికి కూడా అంబేద్కర్ పేరు పెట్టుకున్నామన్నారు. ఇక్కడికి దగ్గరలోనే అమరవీరుల స్మారకం ఉందన్నారు. అంబేద్కర్ విగ్రహం సమీపంలోనే బుద్ధుడి విగ్రహం ఉందని, బుద్ధుడి సిద్ధాంతాలు స్మరణకు వచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఇది విగ్రహం కాదు.. విప్లవం అని అన్నారు. ఈ విగ్రహం తెలంగాణ కలలు సాకారం చేసే చిహ్నంగా అభివర్ణించారు. విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అంబేద్కర్ పేరిట అవార్డు ఇవ్వాలని కత్తి పద్మారావు సూచించారని, అందుకు అనుగుణంగా అంబేద్కర్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది అవార్డు ఇవ్వబోతోందని ముఖ్యమంత్రి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

చూసావా... మన అభివృద్ధి, అత్యంత ధనవంతుడైన సీఎం మనోడేనట!

జగన్ అధికారంలోకి రావాలనే పొడిచా

- కత్తిని రెండుసార్లు స్టెరిలైజ్ చేయించా
- ఇందులో కుట్ర లేదు
- కోడికత్తి కేసులో శ్రీను వాంగ్మూలం
- దాన్ని చార్జిషీటుకు జతచేసిన ఎన్ఐఏ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి :

కోడి కత్తి కేసులో మరికొన్ని సంచలన విషయాలు బయల్పడ్డాయి. 'కోడికత్తి' దాడి వెనుక ఎలాంటి కుట్ర లేదని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో కుట్రను వెలికి తీసేలా దర్యాప్తు చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి

- మిగతా 2 లో

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి పీసీ జోషి జయంతి సందర్భంగా వారికి న్యూఢిల్లీలోని అజయ్‌భవన్‌లో శుక్రవారం సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్, జోషి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఢిల్లీ మద్యం కుంభకోణం

కేజ్రీవాల్‌కు సీబీఐ నోటీసులు

న్యూఢిల్లీ:

మద్యం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సీబీఐ నోటీసులు జారీ చేసింది. ఈనెల 16న విచారణకు హాజరు కావాలని దర్యాప్తు సంస్థ ఆదేశించింది. ఆదివారం ఉదయం 11గంటలకు సీబీఐ కేంద్ర కార్యాలయానికి రావాలని, దర్యాప్తు బృందం అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని కేజ్రీవాల్‌కు జారీచేసిన సమన్లు పేర్కొన్నాయి. ఇదే కేసులో మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా అరెస్టుకు గురైన విషయం విదితమే. ఢిల్లీ ప్రభుత్వ మద్యం విధానం 2021-22 లంచాలిచ్చిన కొందరు డీలర్లకు అనుకూలమన్న ఆరోపణలు రాగా

- మిగతా 2 లో

శక్తిమంతమైన ఖండాంతర

క్షిపణిని పరీక్షించిన ఉ.కొరియా

కుటుంబ సమేతంగా వీక్షించిన కిమ్

సియోల్: అత్యంత శక్తిమంతమైన కొత్త సాలిడ్-ఫ్యూయల్ ఖండాంతర క్షిపణి(ఐసీబీఎం) 'హ్వాసాంగ్-18'ని ఉత్తర కొరియా ప్రయోగించింది. దేశ అణ్వాయుధ శక్తిని మరింత పెంచుకునే దిశగా ఉత్తర కొరియా అడుగులు వేస్తోంది. ఈ మేరకు 'ది కొరియన్ సెంట్రల్ న్యూస్' ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. అధినేత కిమ్ జాంగ్ ఉన్ మార్గదర్శకత్వంలో ఈ క్షిపణి ప్రయోగం జరిగింది. తమ శత్రువులను గడగడలాడిస్తామని ఈ ప్రయోగం ద్వారా ఉత్తర కొరియా చెప్పకనే చెప్పింది. అమెరికాకు పరోక్ష హెచ్చరికలు చేసింది. ఇటీవల అమెరికా, దక్షిణ కొరియా సంయుక్తంగా చేపట్టిన సైనిక విన్యాశాలను ఉత్తర కొరియా విమర్శించింది. అదే క్రమంలో తమ ఆయుధ పరీక్షలను మరింత పెంచింది. ఉత్తర కొరియా ఆయుధాలను తయారు చేస్తూనే ఉన్నదని, ఆ దేశం ఇంకా సాలిడ్ ఫ్యుయల్ టెక్నాలజీపై పట్టు సాధించలేదని దక్షిణ కొరియా రక్షణశాఖ పేర్కొంది. 2020 నుంచి భారీ ఆకారంలోని మోటార్లు పరీక్షిస్తోందని, ఇటువంటి పరీక్షను ఉత్తర కొరియా నిర్వహిస్తుందని ముందే అంచనా వేశామని సెంటర్ ఫర్ నాన్ ప్రొలిఫరేషన్ స్టడీస్‌కు చెందిన జేమ్స్ మార్టిన్ వెల్లడించారు. తాజా క్షిపణి పరీక్షను కిమ్ తన కుమార్తె, భార్య, సోదరితో కలిసి పర్యవేక్షించిన చిత్రాలను కేసీఎన్ఏ విడుదల చేసింది. ఐసీబీఎం హ్వాసాంగ్-18 క్షిపణి సాలిడ్ ఫ్యుయల్ మల్టీస్టేజ్ మోటార్ సామర్థ్యాన్ని కలిగివుంది. ఇటువంటి ఖండాంతర క్షిపణిని ఉత్తర కొరియా పరీక్షించడం ఇదే తొలిసారి.

ఈ టెక్నాలజీ విజయవంతమైతే అమెరికాపై ఎటువంటి హెచ్చరికలు లేకుండా నిమిషాల వ్యవధిలోని ఉ.కొరియా దాడి చేసే అవకాశం ఉంటుంది. సాలిడ్ ఫ్యుయల్ ఐసీబీఎంను తయారు చేయాలన్నది ఉత్తర కొరియా దీర్ఘకాలిక లక్ష్యం. యుద్ధంలో క్షిపణులను మరింత వేగంగా ప్రయోగించేందుకు ఈ సాంకేతిక ఉపయుక్తంగా ఉంటుందన్నది ఆ దేశం భావన.

విశాలాంధ్ర ప్రపంచం

డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించాలి

జిన్‌పింగ్‌తో భేటీలో లూలా

షాంఘై: బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా శుక్రవారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. బీజింగ్‌లో ఆయనకు ఆత్మీయ స్వాగతం లభించింది. ఇద్దరు నాయకులు తాజా పరిణామాలపై నిశితంగా చర్చించుకున్నారు. డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించేందుకు ముమ్మర చర్యలు అవశ్యమని జిన్‌పింగ్‌తో లూలా చెప్పారు. పశ్చిమ దేశాల నేతృత్వ ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యాన్ని, వాణిజ్యం-సవాళ్లపై పెత్తనాన్ని తగ్గించే అంశమై చర్చించారు. ఉక్రెయిన్-రష్యా మధ్య శాంతి ప్రక్రియపైనా ఇద్దరు చర్చించినట్లు సమాచారం. లూలా గురువారం న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఆయన అక్కడ మాట్లాడుతూ 'రోజు రాత్రి నాకు నేనుగా ప్రశ్నించుకుంటుంటాను. సెటిల్మెంట్ కరెన్సీగా డాలర్‌ను మాత్రమే ఎందుకు వినియోగించాలి? సొంత కరెన్సీల ఆధారంగా వాణిజ్యాన్ని ఎందుకని కొనసాగించరాదు? అని అన్నారు. బ్రెజిల్ అధ్యక్షుడిగా లూలా తొలిసారి చైనాలో అధికారికంగా పర్యటించారు. లూలా పర్యటన క్రమంలో బ్రెజిల్ వర్షారణ్యంలో పర్యావరణ పర్యవేక్షణ మెరుగుదల కోసం ఉపగ్రహాల నిర్మాణంతో సహా 20 ద్వైపాక్షిక ఒప్పందాలు జరుగుతాయని తెలుస్తోంది. సొంత కరెన్సీలలో వాణిజ్యం చేసే విధంగా బీజింగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు బ్రెజిల్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించాలని ప్రతిపాదించింది. వాణిజ్యం కోసం డాలర్‌పైనే ప్రతి దేశం ఆధారపడాల్సిన అవసరం ఏమిటని బ్రెజిల్ ప్రశ్నించింది. బ్రెజిల్, చైనా లేక బ్రెజిల్, ఇతర బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యానికి బ్రిక్స్ బ్యాంకు వంటి బ్యాంకు ఎందుకని ఓ కరెన్సీని పెట్టుకోకూడదని లూలా ప్రశ్నించారు. ఎగుమతుల కోసం డాలర్లపై ఆధారపడాల్సి వస్తోంది. సొంత కరెన్సీలోనే ఎగుమతులు చేసుకోవచ్చు అని ఆయనన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) మీద ఆయన అసహనం వ్యక్తంచేశారు. ఆర్థిక కష్టాల్లో ఉన్న అర్జెంటైనా వంటి బ్రెజిల్ పొరుగు దేశలపై ఎక్స్ఛేంజ్‌లో బెయిలౌట్ రుణాల కోసం ఐఎంఎఫ్ ఒత్తిడి తెస్తోందని అన్నారు. ఏ బ్యాంకు కూడా ఇలా చేయకూడదన్నారు. అప్పు ఉన్నంత మాత్రాన నాయకుడి మెడపై కత్తి పెట్టి పనిచేయమనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అర్జెంటైనా విషయంలో ఐఎంఎఫ్ వ్యవహార తీరును లూలా తీవ్రంగా ఖండించారు.

బీజేపీని సాగనంపుదాం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటుకు కుటిల యత్నం చేస్తున్నట్లు విమర్శించారు. తుదకు రాజ్యం స్వరూపమే మార్చడానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో ప్రజల తరపున మాట్లాడే వారి గొంతును మోదీ సర్కారు నొక్కుతోందన్నారు. పతిపక్ష నేతలపై ఈడీ, ఐటీ, సీబీఐ వంటి రాజ్యాంగ సంస్థలను ఉసిగొల్పిదాడులకు పాల్పడుతోందన్నారు. అక్రమ కేసులు నమోదు చేసి జైళ్లకు పంపుతోందని ధ్వజమెత్తారు. 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి అదానీ ఆదాయం రూ.50 వేల కోట్లు ఉండగా...2022 నాటికి ఆయన ఆస్తి ఒక్కసారి రూ.10.50 లక్షల కోట్లకు ఎగబాకిందన్నారు. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పవర్ ప్రాజెక్టులను అదానీకి మోదీ ప్రభుత్వం అప్పగించడం వల్ల ఆయన ఆస్తులు పెరిగిపోయాయన్నారు. సామాన్య ప్రజలపై మోదీ ప్రభుత్వం భారాలు మోపుతోందన్నారు. 'భారతదేశం హిందూ రాష్ట్రంగా మారడమంటే...ఈ దేశం వినాశనం కావడమేనని బీఆర్ అంబేద్కర్ చెప్పారని' ప్రకాశ్ కారత్ గుర్తుచేశారు. ఈ దేశాన్ని వినాశనం నుంచి కాపాడేందుకుగాను సీపీఐ, సీపీఎం చేపట్టిన ప్రచారభేరి విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు పి.మధు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.దుర్గాభవాని, సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కె.శ్రీదేవి, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, నగర నాయకులు లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు, పి.దుర్గాంబ, సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, నగర నాయకులు దోనేపూడి కాశీనాథ్, నాయకులు సత్తిబాబు, ఉభయపార్టీలు, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

జగన్ అధికారంలోకి రావాలనే పొడిచా

(మొదటిపేజీ తరువాయి)

దాఖలు చేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని, దానిని కొట్టివేయాలని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానాన్ని కోరింది. ఇప్పటికే విచారణ ప్రారంభమైన ఈ కేసులో మళ్లీ దర్యాప్తు అవసరం లేదని స్పష్టం చేసింది. గతంలో విచారణ సందర్భంగా నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావు చెప్పిన మాటలను, చార్జిషీటు, కౌంటర్‌తో పాటు ఈ-స్టేట్‌మెంట్‌ను ఎన్ఐఏ తాజాగా జతచేసింది. దీనిలో నిందితుడు చెప్పిన విషయాలు ఇలా ఉన్నాయి. 'నేను మొదటి నుంచి వైఎస్సార్ అభిమానిని. జగన్ అధికారంలోకి రావాలని కోరుకున్నా. ప్రజల్లో సానుభూతి కోసం జగన్‌పై దాడి చేశా. మీడియా ద్వారా జగన్‌పై సానుభూతి పెరుగుతుందని భావించా. ప్రమాదం జరగకుండా కోడికత్తిని రెండు సార్లు స్టెరిలైజ్ కూడా చేయించా. విమానాశ్రయంలో తొలుత జగన్‌కు టీ ఇచ్చేందుకు వెళ్లి ఈసారి ఎన్నికల్లో 160 సీట్లతో గెలుస్తారని ఆయనకు చెప్పాను. నా మాటలకు ఆయన చిరునవ్వు చిందించారు. దాడి జరిగిన వెంటనే వైసీపీ నేతలు నాపై దాడి చేశారు. పోలీసులు నన్ను కాపాడి ఓ గదిలో బంధించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అప్పట్లో ఆంధ్రా పోలీసులు నన్ను బాగా కొట్టారు. ఈ ఘటన వెనుక ఎవరున్నారని విచారణ చేశారు. నా సొంత ఆలోచనతోనే దాడికి పాల్పడ్డానని చెప్పాను. ఎన్నిసార్లు అడిగినా ఇదే విషయం చెప్పాను. కట్టు కథలు చెప్పాలని పోలీసులు నాపై ఎటువంటి ఒత్తిడి తేలేదు. ఏ పార్టీకి అనుకూలంగాగానీ, వ్యతిరేకంగాగానీ చెప్పాలని ఒత్తిడి చేయలేదు. అందువల్లే జడ్జి దగ్గర నేను పోలీసులపై ఎటువంటి ఆరోపణలు చేయలేదు. సింహాచలం దేవస్థానానికి వెళితే దేవుడి దర్శనానికి రూ.200 అడిగారు. హోటల్ పెట్టుకుందామంటే రుణం కూడా ఇవ్వలేదు. ఇటువంటి ఘటనలతో నాకు అసహనం పెరిగింది. ఇదే అంశంపై 24 పేజీల పుస్తకం రాశాను. పుస్తకం పూర్తి చేద్దామంటే విశాఖ జైలు సిబ్బంది లాగేసుకున్నారు. చేసేది తప్పు అని తెలిసినా జగన్ అధికారంలోకి వస్తే ప్రజా సమస్యలు తీరతాయనే ఆయనపై దాడి చేశాను. జగన్ సార్‌ని, నా తల్లిదండ్రులను క్షమాపణ కోరుతున్నాను' అని శ్రీనివాసరావు వాంగ్మూలం ఇవ్వగా దానిని కోడికత్తి కేసు చార్జిషీటుకు ఎన్ఐఏ జత చేసింది.

గీతం కళాశాల వద్ద కంచె నిర్మాణం

పోలీసుల భారీ బందోబస్తు... ఆంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖపట్నంలోని గీతం విశ్వవిద్యాలయం వద్ద మరోసారి ఉద్రిక్తత నెలకొంది. విశ్వవిద్యాలయంలో కొంతమేర ప్రభుత్వ స్థలంగా గుర్తించినట్లు తెలిపిన రెవెన్యూ అధికారులు కంచె నిర్మాణం చేపడుతున్నారు. పోలీసు బందోబస్తు మధ్య కంచె నిర్మాణ సామాగ్రితో వర్సిటీలోకి రెవెన్యూ సిబ్బంది వెళ్లారు. ప్రధాన క్యాంపస్‌లోని డెంటల్ కాలేజ్ వద్ద కిలోమీటరు మేర కంచె వేస్తున్నారు. ఆర్డీవో భాస్కర్ రెడ్డి అధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. కంచె ఏర్పాటు నేపథ్యంలో తెల్లవారుజామున 2 గంటల నుంచే గీతం విశ్వవిద్యాలయానికి వెళ్లే అన్ని రోడ్లపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఎండాడ, రుషికొండ మార్గంలో సుమారు రెండు కిలోమీటర్ల ముందుగానే బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఐడీ కార్డులు చూపిస్తేనే స్థానికులను మార్గంలో పంపిస్తున్నారు. పోలీసులు ఆంక్షలతో చుట్టు పక్కల ప్రజలు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏసీపీ మూర్తి అధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు జరిగాయి. ఈ ఏడాది జనవరిలోనూ గీతం కళాశాలను ఆనుకొని ఉన్న 14 ఎకరాల భూమిని ప్రభుత్వ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. గీతం విశ్వవిద్యాలయంపై రాష్ట్ర ప్రభుత్వ కక్ష సాధింపు కొనసాగుతోందని టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ ఆరోపించారు. కంచె ఏర్పాటు విషయం తెలుసుకున్న ఆయన గీతం కళాశాల ప్రాంగణం వద్దకు వచ్చారు. సామాన్యులకు ఇబ్బందులు కలగ కుండా చూడాలని ఈ సందర్భంగా పోలీసులను ఆయన కోరారు. అనంతరం మీడియాతో గండి బాబ్జీ మాట్లాడుతూ నిజంగా ప్రభుత్వ భూమి ఉంటే ఒకేసారి తీసుకోవాలి తప్ప ప్రతిసారీ ఇలా ఇబ్బంది పెట్టడం దుర్మార్గపు చర్య అని అన్నారు. గీతం విశ్వవిద్యాలయంలో కంచె వేస్తే చుట్టుపక్కల బారికేడ్లు ఎందుకని ఆయన ప్రశ్నించారు. అంబేద్కర్ జయంతి రోజున అప్రజాస్వామ్యం నడుస్తోందన్నారు. పోలీసులు వేరే మార్గంలో వెళ్లమంటే ప్రజలు ఎన్ని అవస్థలు పడతారో అర్థం చేసుకోవాలని అన్నారు.

కేంద్రం తీరుపై ఉక్కు కార్మికుల ఆగ్రహం

మోదీ దిష్టిబొమ్మ దహనం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కార్మికులు మరోసారి రోడ్డెక్కారు. విశాఖ కూర్మన్నపాలెం కూడలి వద్ద జాతీయ రహదారిపై ధర్నాకు దిగిన కార్మికులు కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆందోళనకారులను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించడంతో కార్మికులు ప్రతిఘటించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. కేంద్ర ప్రభుత్వం మొండివైఖరి వీడకపోతే ఎంతకైనా పోరాడతామని కార్మికసంఘాల నాయకులు హెచ్చరించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేది లేదని కేంద్రం శుక్రవారం స్పష్టం చేసింది. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను నిలుపుదల చేసినట్లు వస్తున్న వార్తలను కేంద్రం ఖండించింది. స్టీల్‌ప్లాంట్‌లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పింది. స్టీల్‌ప్లాంట్ పనితీరు మెరుగుకు ప్రభుత్వం, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ తమ వంతు కృషి చేస్తున్నాయని ఉక్కు మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. గురువారం విశాఖలో పర్యటించిన కేంద్రమంత్రి ఫగ్గన్ సింగ్...ఇప్పటికిప్పుడు స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలని కేంద్రం అనుకోవడం లేదని చెప్పారు. కేంద్రమంత్రి చెప్పిన 24 గంటల్లోనే అందుకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయడంతో కార్మికుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వందలాదిమంది స్టీల్‌ప్లాంట్ కార్మికులు నిరసనకు దిగారు.

కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ సమయంలో పోలీసులు, కార్మికుల మధ్య మధ్య తీవ్ర తోపులాట జరిగింది. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, కన్వీనర్ అయోధ్యరాం, కెఎస్ఎన్ రావు, రామస్వామి, గుమ్మడి నరేంద్ర, శ్రీనివాసరావు, కె.వెంకట్రావు, అప్పలరాజు సహా పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై

అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ అంశంపై గంటకో మాట చెబుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిపై సీఎం జగన్ తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, విశాఖ పోర్ట్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే కేంద్రం స్టీల్ ప్లాంట్‌ను వెంటనే ప్రైవేట్‌పరం చేయాలనుకోవడం లేదని, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌ను బలోపేతం చేసే ఆలోచనలో ఉన్నామని ప్రకటించారని గుర్తుచేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయించకుండా, పూర్తిస్థాయి ఉత్పత్తి జరగకుండా కేంద్రమే దశలవారీగా నష్టాల్లోకి నెడుతున్న విషయం బహిరంగ రహస్యమని అన్నారు. పార్లమెంటులో ఎంపీలు అడిగిన ప్రశ్నలకు విశాఖ ఉక్కును కచ్చితంగా ప్రైవేటీకరణ చేసి తీరతామని చాలాసార్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని, కేంద్ర మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే విశాఖ పర్యటనలో ఉదయం ఒక ప్రకటన, మధ్యాహ్నానికి మరో ప్రకటన చేశారని వివరించారు. ఇవి మోదీ సర్కార్ ద్వంద్వ నీతికి, అవకాశవాదానికి తార్కాణాలని తెలిపారు. విశాఖ ఉక్కుపై కేంద్రం పదే పదే మోసగిస్తున్న విషయం స్పష్టమవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. విశాఖ స్టీల్ ఈఓఐ బిడ్ వేసేందుకు తెలంగాణా ప్రభుత్వం చొరవ చూపడం గమనార్హం. పొరుగున ఉన్న తెలంగాణా ప్రభుత్వానికి ఉన్న ఆసక్తి, ఏపీ ప్రభుత్వానికి లేకపోవడం విచారకరమని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని విక్రయించకుండా కేంద్రంపై ఒత్తిడి తేవడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. సీఎం జగన్ ఇప్పటికైనా స్పందించాలని, తక్షణమే అన్ని రాజకీయ పార్టీలు, యూనియన్లను, ఏపీకి చెందిన ఎంపీలను ఆహ్వానించి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం మెడలు వంచేందుకు జగన్‌మోహన్ రెడ్డికి వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ అమ్మకాన్ని విరమించుకుంటున్నట్లు కేంద్రం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చేవరకు అందరినీ కలుపుకుని పోరాడాలని పిలుపునిచ్చారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించండి

కేవీవీ ప్రసాద్ పిలుపు

విశాలాంధ్ర, మచిలీపట్నం : కార్పొరేట్ సంస్థల చేతుల్లో బీజేపీ ప్రభుత్వం కీలుబొమ్మగా వ్యవహరిస్తోందనీ, మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉన్నదని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్, వై వెంకటేశ్వరరావు నొక్కిచెప్పారు. బీజేపీని సాగనంపుదాం, దేశాన్ని కాపాడుదాం ప్రచార బేరి కార్యక్రమం శుక్రవారం స్థానిక జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమైంది. సీపీఐ జిల్లా ఇన్చార్జి కార్యదర్శి తాటిపర్తి తాతయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ దేశంలోని ప్రభుత్వ ఆస్తులన్నీ ఆదాని, అంబానీలకే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అప్పలంగా దోచిపెడుతోందన్నారు. మోదీ దేశాన్ని అప్పుల కుప్పగా మార్చేశారన్నారు. ఈ నెల 30 వరకు అన్ని ప్రాంతాలలో ప్రచార బేరి నిర్వహిస్తామని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి తలొగ్గి ఈ రాష్ట్ర భవిష్యత్తు సర్వనాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రోజు రోజుకి నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటడంతో బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ వందన సమర్పణ చేశారు.

అంబేద్కర్ విశ్వమానవుడు

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్ ప్రకటించారు. అందుకోసం వెంటనే రూ.51 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ డబ్బుపై ప్రతి ఏడాది వచ్చే రూ.3 కోట్లు వడ్డీతో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించే వారికి ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు గడుస్తున్నా నేటికి దళితులు ఇంకా పేదరికంలోనే మగ్గడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ రాష్ట్రం దళితుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం రూ.16 వేల కోట్లు ఖర్చు చేస్తే తెలంగాణ ప్రభుత్వం రూ.లక్షా 25 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. వచ్చే 2024 పార్లమెంటు ఎన్నికల్లో వచ్చేది మన రాజ్యమే అని ధీమా వ్యక్తం చేశారు. జాతీయ రాజకీయాల్లో ఇదే రకమైన కార్యక్రమాలు చేసేందుకు పార్టీని జాతీయంగా విస్తరించామని తెలిపారు. తప్పకుండా 2024 పార్లమెంటు ఎన్నికల్లో భారతదేశంలో రాబోయే రాజ్యం మనదే అని, ఇది మన శత్రువులకు మింగుడు పడకపోవచ్చన్నారు. కానీ, ఒక చిన్న మిణుగురు చాలు అంటుకోవడానికి అని అన్నారు. ఈ మధ్య మహారాష్ట్రకు పోతే నా కలలో కూడా ఊహించని విధంగా ప్రోత్సాహం ఆదరణ లభించిందని, త్వరలో ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్‌లో కూడా వస్తుందని కేసీఆర్ స్పష్టం చేశారు.

దేశంలో కొత్త నడవడికకు కేసీఆర్ శ్రీకారం : ప్రకాష్ అంబేద్కర్

దేశంలో కొత్త నడవడిక ముఖ్యమంత్రి కేసీఆర్ మొదలుపెట్టారని అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ జయంతిని ముఖ్యమంత్రి కేసీఆర్ చాలా ప్రత్యేకంగా నిర్వహించారని ప్రశంసలు కురిపించారు. మనం యుద్ధం చేయవలసింది ప్రజల్లో మార్పుకోసం, వ్యవస్థలో మార్పు కోసం, దేశంలో మార్పు కోసం అని చెప్పారు. దేశంలో ఆర్థిక ఇబ్బందులపై ఎలా పోరాటం చేయాలో ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త దిశ చూపించారని అభిప్రాయపడ్డారు. దేశంలో ఆర్థిక అసమానతలపై ఆనాడే అంబేద్కర్ పోరాటం చేశారని, అంబేద్కర్ స్ఫూర్తితో మళ్లీ ప్రస్తుతం ఆర్థిక పరిస్థితిని కాపాడేందుకు పోరాటం చేసేందుకు కేసీఆర్ దిశ మొదలుపెట్టారని అన్నారు. దేశంలో ఒక్క రిలీజియన్ మైనార్టీ మాత్రమే లేదని, కమ్యూనిటీ మైనార్టీ కూడా ఉందని, రిలీజియస్ మైనార్టీ తరహాలో కమ్యూనిటీ మైనార్టీ ఉందని ఆనాడే అంబేద్కర్ చెప్పారన్నారు. అంబేద్కర్ తెచ్చిన రాజ్యాంగం ప్రకారమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన దళిత బంధు పథకం మంచి పథకమని అన్నారు. ఈ దేశంలో ధనవంతుడు... ధనవంతుడిగా, పేదోడు పేదోడిగానే ఉంటాడని, దళిత బంధు ఫలితం రానున్న రోజుల్లో తెలుస్తుందన్నారు. దళిత బంధును ఇవ్వాళ కేసీఆర్ ప్రారంభించారని, రానున్న రోజుల్లో మరో ముఖ్యమంత్రి ప్రారంభించాలని ఆకాంక్షించారు. దేశానికి రక్షణపరంగా రెండవ రాజధాని అవసరమని, అది హైదరాబాద్ అయితేనే బాగుంటుందని అన్నారు. హైదరాబాద్ రెండో రాజధాని అవ్వాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉందని, అది నెరవేరాలని కోరుకుంటున్నానని తెలిపారు. హిందువులకు, ముస్లింలకు ప్రత్యేక దేశం కావాలనే ప్రతిపాదన మేరకు ఇండియా, పాకిస్తాన్ ఏర్పాటు జరిగాయన్నారు. ప్రస్తుతం దేశంలో జాతీయ నాయకుడు లేడు, గతంలో వాజపేయి మాత్రమే జాతీయ నాయకుడని, స్థానిక నేతలకు జాతీయ స్థాయి నేతగా ఎదిగేందుకు మంచి అవకాశం ఉందన్నారు. తెలంగాణ దేశానికి దిక్సూచిగా ఉందని, దేశానికి ఇలాంటి నమూనా అవసరమని ప్రకాష్ అంబేద్కర్ అన్నారు.

మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడుకుందాం: డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-ఏలూరు: బీజేపీ-ఆర్ఎస్ఎస్ చేతుల్లో నుంచి దేశాన్ని కాపాడుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ. రవి పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక, మతోన్మాద, కార్పొరేట్ సంస్థల అనుకూల విధానాలపై సీపీఐ, సీపీఎం చేపట్టిన ప్రచారభేరి యాత్రను శుక్రవారం ఏలూరులో ప్రారంభించారు. తొలుత ఏలూరు పాత బస్టాండ్ సెంటర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభకు సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పల్లెం కిషోర్ అధ్యక్షత వహించారు. ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. మోదీ, అమిత్ షా నాయకత్వంలో బీజేపీ-ఆర్ఎస్ఎస్ కూటమి ప్రజల మధ్య మతవిద్వేషాలు రాజేస్తోందని విమర్శించారు. అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నాయన్నారు. పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్యం ప్రమాదంలో పడిందని, దాన్ని కాపాడుకోవడానికి జాతీయోద్యమ స్ఫూర్తితో మళ్లీ ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల్ని, ఓడరేవుల్ని కార్పొరేట్ సంస్థలకు మోదీ సర్కారు కట్టబెడుతోందని విమర్శించారు. పేదలపై మోదీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరల భారం మోపిందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. పేదలకు విద్యా, వైద్యం అందని ద్రాక్షగా మారిందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని సైతం మోదీ ప్రభుత్వం అటకెక్కిస్తున్నదని విమర్శించారు. మహిళలకు, దళితులకు, మైనార్టీలకు, గిరిజనులకు రక్షణ కరువైందన్నారు. మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. మోదీని ప్రశ్నించలేని దుస్థితిలో వైసీపీ, టీడీపీ, జనసేన ఉన్నాయన్నారు.

కేంద్రం మళ్లీ యూటర్న్

(మొదటిపేజీ తరువాయి)

ఈ మేరకు ఉక్కు మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. గురువారం సాక్షాత్తూ కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ ఇప్పటికిప్పుడు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలని కేంద్రం అనుకోవడం లేదని, ప్లాంట్‌ను బలోపేతం చేసే ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పగా, ఒక్కరోజు వ్యవధిలో యూటర్న్ తీసుకుంటూ ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రైవేటీకరణ ఆగదని ప్రకటన చేయడం రాష్ట్ర ప్రజలను తీవ్ర ఆగ్రహానికి గురి చేస్తోంది. గంటకో మాట మారుస్తున్న కేంద్ర వైఖరిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. కేంద్ర మంత్రి ఉదయం ఒక ప్రకటన, మధ్యాహ్నం మరో ప్రకటన చేయడం మోదీ సర్కారు ద్వంద్వ నీతికి నిదర్శనంగా పేర్కొన్నారు. విశాఖ ఉక్కుపై కేంద్రం ప్రజలను పచ్చి దగా చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. సీఎం జగన్ ఇప్పటికైనా స్పందించి తక్షణమే ఏపీ ఎంపీలు, రాజకీయ పార్టీలన్నింటితో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రం చేసిన భిన్న ప్రకటనలతో బీజేపీ అసలు బండారం బయటపడిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ గొంతు నులిమి హత్య చేస్తున్నా వైసీపీ ప్రభుత్వం చూస్తూ మిన్నకుండటం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై బీజేపీ నయవంచన, పూటకొక మాట మార్చే ప్రకటనలపై రాష్ట్ర ప్రగతి కోరుకునే మేధావులు, ప్రజాస్వామ్యవాదులు నిరసించాలని కోరారు. గతంలోనూ రాష్ట్ర విభజన సందర్భంగా పార్లమెంటు సాక్షిగా చేసిన హామీలు, విభజన చట్టంలోని అంశాలను కూడా కేంద్ర ప్రభుత్వం 9 సంవత్సరాలు పూర్తికావస్తున్నా ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదు. అమరావతి రాజధానికి స్వయంగా శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, దానిని వైసీపీ ప్రభుత్వం విధ్వంసం చేస్తున్నా, రైతులు మూడేళ్లుగా ఆందోళన చేస్తున్నా కనీసం ఇప్పటివరకు స్పందించలేదు. పైగా కోర్టుల్లో ఒకసారి రాజధాని అంశం రాష్ట్ర పరిధిలోని అంశమని, మరోసారి విభజన చట్టం ప్రకారమే అమరావతి ఏర్పడిందంటూ అఫిడవిట్లు దాఖలు చేసింది. ఇలా ప్రతి అంశంలోనూ ప్రజలను మోసం చేస్తూ బీజేపీ ఆడుతున్న నాటకాలను ప్రజలు తిప్పికొట్టాలని వామపక్ష నేతలు కోరారు.

కేజ్రీవాల్‌కు సీబీఐ నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

వాటిని ఆప్ తీవ్రంగా ఖండించింది. ఆ తర్వాత మద్యం విధానం రద్దు అయింది. మద్యం విధానంలో సవరణలు, అనుకూలంగా ఉన్న వారి లైసెన్సు కాలాన్ని పొడిగించడం, లైసెన్సు రుసుములో రాయితీలివ్వడం లేదా మాఫీ చేయడం, ఎల్-1 లైసెన్సును ఆమోదం లేకుండానే పొడిగించడం వంటివి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఈ వ్యవహారంలో కొందరిని సీబీఐ అరెస్టు చేసింది. వారి రిమాండ్ రిపోర్టులో కేజ్రీవాల్ పేరు ప్రస్తావనకు వచ్చిన నేపథ్యంలో సీబీఐ తాజాగా నోటీసులు జారీ చేసింది. ఢిల్లీ మద్యం విధానంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్‌కుమార్ సక్సేనా 2022 జులై 20న కేంద్ర హోంశాఖకు లేఖ రాయడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. దాన్ని పరిగణనలోకి తీసుకుని దర్యాప్తు జరపాలని ఆదేశిస్తూ హోంశాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ సీబీఐ అవినీతి నిరోధక విభాగానికి లేఖ రాయడంతో సీబీఐ కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్‌లో ఏ1గా సిసోదియా పేరును చేర్చింది. సమాంతరంగా ఇదే కేసును దర్యాప్తు చేస్తున్న ఈడీ ఇప్పటి వరకు సమీర్ మహేంద్రు, విజయ్‌నాయర్, పి.శరత్‌చంద్రారెడ్డి, బినయ్‌బాబు, అభిషేక్ బోయిన్‌పల్లి, అమిత్ అరోడా, మాగుంట రాఘవరెడ్డిలను అరెస్ట్ చేసింది. తెలంగాణ ఎమ్మెల్సీ కవితను కూడా ఇటీవల ఈడీ విచారించింది

పాలకుల దివాళాకోరు విధానాలను తిప్పికొట్టండి

వినుకొండలో ప్రచారభేరి ప్రారంభిస్తూ ముప్పాళ్ల పిలుపు

విశాలాంధ్ర-వినుకొండ: దేశంలో ప్రజావ్యతిరేక, నిరంకుశ ,మతోన్మాద విధానాలను కొనసాగిస్తున్న బీజేపీని సాగనంపుదాం, దేశాన్ని కాపాడుకుందాం నినాదంతో చేపడుతున్న ప్రచార భేరి కార్యక్రమం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం వినుకొండలో ప్రారంభమైంది. తొలుత సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, పల్నాడు జిల్లా కార్యదర్శి వరప్రసాద్, వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు నాయకత్వంలో శివయ్య స్తూపం నుంచి పాదయాత్ర కార్యక్రమం ప్రారంభమై పల్నాడు రోడ్ లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ముప్పాళ్ల ప్రారంభించారు. అనంతరం శివయ్య స్తూపం సెంటర్ లో భూదాల శ్రీనివాస అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ముప్పాళ్ల మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత మైనార్టీలు, దళితులపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ గుండాలు భౌతిక దాడులకు పాల్పడుతూ ప్రజలను తీవ్ర ఆందోళనలకు గురి చేస్తుంటే మరోవైపు దేశాన్ని పాలిస్తున్న మోదీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలుపరచకపోగా అందుకు విరుద్ధంగా మొత్తం దేశ సంపదను గుత్తపెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తూ దేశాన్ని దివాలా తీయిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ఆధానికో, అంబానీకో కట్టబెడుతుంటే అడ్డుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని ముప్పాళ్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక చర్యలపై ప్రజలను చైతన్యపరిచేందుకు ప్రచార భేరి కార్యక్రమం చేపట్టినట్లు ముప్పాళ్ల నాగేశ్వరావు తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సభలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, పట్టణ కార్యదర్శి బొంకురి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కె. హనుమంత రెడ్డి, కె.శివరామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిన్ని బోయిన వెంకటేశ్వర్లు, సీపీఐ సీనియర్ నాయకులు పఠాన్ లాల్ ఖాన్, వినుకొండ మండల కార్యదర్శి భూదాల సాగర్, నూజెండ్ల మండల కార్యదర్శి ఏ పవన్ కుమార్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి కేంద్రం తూట్లు

సత్యనారాయణమూర్తి, జగ్గునాయుడు విమర్శ

అంబేద్కర్‌కు నివాళి.. ప్రచారభేరి ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖ: రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న మోదీ పభుత్వం అంబేద్కర్ గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విమర్శించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం డాబాగార్డెన్స్‌లోని

ఎల్ఐసీ భవన సమీపంలో గల అంబేద్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మనుధర్మశాస్త్రమే దేశ రాజ్యాంగమని చెబుతున్నవారు అంబేద్కర్ గురించి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. ఒకప్పుడు వారే రాజ్యాంగాన్ని సమీక్షించాలని చెప్పారని గుర్తుచేశారు. దళితులు, గిరిజనులు, మహిళల హక్కుల కోసం చివరి వరకు అంబేద్కర్ పోరాడారన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. మోదీ ప్రభుత్వ మతోన్మాద, పెట్టుబడిదారీ అనుకూల పాలనకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాన్ని అంబేద్కర్ జయంతినాడు ప్రారంభించినట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. జగ్గునాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, కర్షక విధానాలను నిరసిస్తూ తాము ప్రచార ఆందోళనలు చేపడుతున్నామని తెలిపారు. నరేంద్ర మోదీ నిరంకుశ పాలనపై అధికార వైసీపీ, ప్రధాన ప్రతిపక్ష టీడీపీ, జనసేన మాట్లాడకపోవడం దుర్మార్గమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను... ముఖ్యంగా విశాఖ ఉక్కును ప్రైవేట్ వారికి కట్టబెట్టే ప్రయత్నం విరమించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ హక్కులు కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న గాజువాకలో సీపీఐ, సీపీఎం సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జీవీఎంసీ 30వ వార్డులో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. సీపీఐ, సీపీఎం నాయకులు ఎస్‌కే రెహమాన్, ఆర్‌కేఎస్‌వీ కుమార్, కె.సత్యాంజనేయ, వై.రాజు, పి.చంద్రశేఖర్, ఎం.సుబ్బారావు, జి.రాంబాబు, ఎం.కృష్ణారావు, సీఎస్ క్షేత్రపాల్, ఎం.మన్మథరావు, ఎన్.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓటమితోనే దేశానికి రక్ష

అంబేద్కర్ స్ఫూర్తితో బీజేపీ విధానాలను తిప్పికొడదాం: అక్కినేని వనజ

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో బీజేపీ విధానాలు తిప్పికొడదామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. బీజేపీ ఓటమితోనే దేశానికి రక్షని, దేశ ప్రజలపై బీజేపీ మెరుపుదాడి చేస్తోందన్నారు. డా. బీఆర్. అంబేద్కర్ 132 జయంతి సందర్భంగా రాజమండ్రి గోకవరం బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద అక్కినేని వనజ, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు టి.అరుణ్, టి.మధు శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో వనజ మాట్లాడుతూ దేశంలో బీజేపీ పాలన అదానీ, అంబానీల కోసమే అన్నట్టుగా ఉందన్నారు. దేశంలో రైతులు, కార్మికులు, ఉద్యోగులు, ప్రజలపై బీజేపీ ప్రభుత్వం మెరుపుదాడి చేస్తోందని చెప్పారు. మోదీ అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయని చెప్పి నిత్యావసరాల ధరలు పెంచారని విమర్శించారు. బీజేపీది అరాచక పాలన అని అన్నారు. ప్రజలమధ్య విద్వేషాలు సృష్టించి మెజారిటీ మతం ఓట్లుతో అధికారం పొందే విధానాలను అనుసరిస్తున్నారని విమర్శించారు. దేశానికి మొషా (మోదీ, అమిత్ షా) ప్రమాదకరమని, వీరిరువురే ఈ దేశాన్ని దివాలా తీయిస్తున్నారని అన్నారు. మోదీ ప్రభుత్వ దాడి నుంచి ప్రజలను కాపాడేందుకు సీపీఎం, సీపీఐ మోదీని గద్దె దించండి, దేశాన్ని కాపాడండి అనే పేరుతో నేటి నుంచి 30 వరకు ప్రచార భేరి కార్యక్రమం నిర్వహిస్తున్నామనీ, ఈ ప్రచారభేరిని ప్రజలు విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి గణేశ్ చౌక్ అల్లూరి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సీపీఐ, సీపీఎం రాజమండ్రి నగర కార్యదర్శులు వి.కొండలరావు, బి.పవన్, సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి కె.రాంబాబు, ఎర్ల లక్ష్మి, రమణమ్మ, నాయకులు నల్లా రామారావు, రామకృష్ణ, భద్రరావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.రాజులోవ, పి.తులసి, కేఎస్వీ రామచంద్ర రావు, ఎస్.రాజా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ పాలనకు చరమగీతం పాడుదాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

బాపట్లలో ప్రారంభమైన ప్రచార భేరి

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల: కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనకు చరమగీతం పాడటమే లక్ష్యంగా సీపీఐ సీపీఎం సంయుక్తంగా పోరాటం చేస్తూనే ఉంటాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ నొక్కిచెప్పారు. మోదీని గద్దించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలపై సీపీఐ, సీపీఎం సంయుక్త అధ్వర్యాన బాపట్ల జిల్లా కేంద్రంలో ప్రచార భేరి ప్రారంభించారు. రైల్వేస్టేషన్‌రోడ్‌లో ర్యాలీ నిర్వహించి బీజేపీని సాగనంపాలని నినా దాలు చేశారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం, ప్రజా స్వామ్యం నిలబడాలంటే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండకూడదన్నారు. బీజేపీ ప్రభుత్వం మతోన్మాద కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పాలన సాగిస్తోందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం నిర్మా ణం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్మకానికి వ్యతి రేకంగా ఉద్యమించాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందన్నారు. ప్రజలను, ప్రభుత్వ సంస్థలను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారే కానీ దేశ అభివృద్ధికి ఒక్క అడుగు కూడా వేయకపోవటం విచారకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తున్నా రాష్ట్రంలో అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ, జనసేన కనీసం ప్రశ్నించకుండా మౌనం వహించటం సిగ్గు చేటన్నారు. 25 మంది ఎంపీలు ఇస్తే కేంద్రంలో ఉన్న ప్రభుత్వాన్ని మెడలొంచి ప్రత్యేక హోదా తెస్తానని ప్రగల్భాలు పలికిన జగన్ ఎక్కడా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, నాయకులు జల్లి భాగ్యశ్రీధర్, మామిడిబత్తుల అశోక్ తదితరులున్నారు.

మోదీ సర్కారు వైఫల్యాలపై తిరుగుబాటు

అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు...

కడపలో ప్రచారభేరి ప్రారంభించిన ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-కడప: మోదీ పాలనలో దళితులకు, మైనార్టీలకు రక్షణ కరువైందని, ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఓబులేసు విమర్శించారు. బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపే వరకు అవిశ్రాంతంగా పోరాటాలు, ప్రచారాలు నిర్వహిస్తామని ఓబులేసు తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసి ప్రచారభేరి ప్రారంభించారు. అనంతరం ఓబులేసు మాట్లాడుతూ మోదీ పాలనలో అదానీ, అంబానీల ఆస్తులు పెరిగిపోయాయన్నారు. అదానీ ఆర్థిక అక్రమాలపై హిండెన్‌బర్గ్ నివేదిక బహిర్గతం కావడం, దీనిపై దేశవ్యాప్తంగా చర్చ జరగడం చూశామన్నారు. అదానీ వ్యవహారంపై పార్లమెంటులో చర్చకు ప్రధాని మోదీ భయపడ్డారని విమర్శించారు. జేపీసీ విచారణ కోసం ప్రతిపక్షాలన్నీ ముక్తకంఠంతో డిమాండ్ చేసినా కేంద్రం మొండిగా వ్యవహరిం చిందన్నారు. అదానీ అంశాన్ని విపక్షాలు ప్రస్తావించడంతో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ బ్రిటన్ వ్యాఖ్యలను తెరపైకి తీసుకొచ్చి బీజేపీ ఎదురుదాడికి దిగిందని మండిపడ్డారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలను వాడుకుంటూ ప్రత్యర్థులపై కుట్రపూరిత రాజకీయాలు చేస్తోందని ఓబులేసు చెప్పారు. మోదీ ప్రభుత్వం ఓ వైపు దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతూ మరోవైపు మతోన్మాద అజెండాను నిస్సిగ్గుగా అమలు చేస్తోందని విమర్శించారు. నిత్యావసర ధరలు, నిరుద్యోగం, పేదరికం వంటి కీలక సమస్యలను విస్మరిస్తున్నదన్నారు. కేంద్రబడ్జెట్‌లో ధరల నియంత్రణకు ఎలాంటి చర్యలు కనిపించలేదన్నారు. దేశాన్ని కాపాడుకోవడానికి లౌకిక, ప్రజాతంత్రశక్తులు ఏకతాటి పైకి రావాల్సిన ఆవశ్యకతను ఓబులేసు ఉద్ఘాటించారు.

సీపీఎం రాష్ట్ర నాయకులు బి.నారాయణ, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గాలి చంద్ర, జి చంద్రశేఖర్ మాట్లాడుతూ జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ ధ్వంసమయ్యాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు విజ్ఞాపన పత్రాలు అందజేసే అవకాశం ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలకు లభించడం లేదన్నారు. విభజన హామీలు, ప్రత్యేకహోదా, పోలవరానికి సకాలంలో నిధులు, విశాఖ రైల్వే జోన్ వంటి అంశాలను పట్టించుకోకపోయినా జగన్ మాత్రం మోదీ ప్రభుత్వాన్ని పల్లెత్తు మాట అనడం లేదని విమర్శించారు. పోలీసులకు అంతులేని అధికారాలు కల్పించి...రాష్ట్రాన్ని పోలీసు రాజ్యంగా మార్చారన్నారు. ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధాలు నిత్యకృత్యమయ్యాయన్నారు. జగన్ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ, జిల్లా కార్యవర్గసభ్యులు పి.కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, బషీరున్నీసా, విజయలక్ష్మి, కేసీ బాదుల్లా, గంగా సురేశ్, జిల్లా సమితి సభ్యులు మద్దిలేటి, సావంత్ సుధాకర్, బందెల ఓబయ్య, మునయ్య, దస్తగిరి, లింగన్న, మల్లికార్జున, మైనుద్దీన్, నారాయణ, భాగ్యలక్ష్మి, పద్మ, ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ, తేజ, అరుణ్, సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, నాయకులు దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల కొమ్ముకాస్తున్న మోదీ

ఈశ్వరయ్య విమర్శ

విశాలాంధ్ర- ఒంగోలు: కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం సామాన్య ప్రజానీకంపై భారాలు మోపుతూ కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో సీపీఐ, సీపీఎం ప్రచార భేరీ కార్యక్రమాన్ని ఈశ్వరయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై భారాలు వేయటమే కాకుండా, ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతు న్నారన్నారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నలలో మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చి దాని స్థానంలో మనువాదాన్ని తెచ్చేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నదన్నారు. రానున్న ఎన్నికలలో బీజేపీని ఓడించి దేశాన్ని కాపాడాలని మోదీ బచావో, బీజేపీ హటావో నినాదంతో ప్రచార భేరీ కార్యక్రమాన్ని సీపీఐ, సీపీఎం చేపట్టాయన్నారు. కార్యక్రమానికి ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు పూనాటి ఆంజనేయులు, సీపీఐ నాయకులు పీవీఆర్ చౌదరి, ఉప్పుటూరి ప్రకాశరావు, ఎస్‌డి సర్దార్, జి రమేష్, జీవీ కొండారెడ్డి, దామా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనతో పొంచివున్న ప్రమాదాలపై

ప్రజలను చైతన్యపర్చాలి: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు: 'మోదీని గద్దె దింపండి-దేశాన్ని కాపాడండి' అంటూ సీపీఐ-సీపీఎం అధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమం శుక్రవారం గుంటూరు జిల్లాలో ఉత్సాహంగా ప్రారంభమైంది. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు సీపీఐ-సీపీఎం శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభలు, సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించారు. సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షతన హరిహరమహల్ వాటర్ ట్యాంకుల వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ నియంతృత్వ పోకడలతో పాలన సాగిస్తున్న మోదీతో దేశానికి పొంచి ఉన్న ప్రమాదాలపై ప్రజలను చైతన్యపర్చడమే లక్ష్యమన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ద్విజాతి సిద్ధాంతాన్ని తీసుకువచ్చారని, ప్రజల మధ్య కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సీపీఎం నగర కార్యదర్శి కె.నళినికాంత్ మాట్లాడుతూ అంబేద్కర్, భగత్ సింగ్ ఆశయాలకు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదన్నారు. అనంతరం సభా వేదిక నుంచి లాడ్జిసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శనగా వెళ్లి రాజ్యాంగ నిర్మాతకు సీపీఐ-సీపీఎం నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నగర నాయకులు ఆకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, మరియదాసు, యశ్వంత్, సీపీఎం నగర కమిటీ సభ్యులు ముత్యాలరావు, అరుణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాగర్ నీటిని విడుదల చేయండి

కృష్ణా బోర్డుకి జలవనరుల శాఖ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నాగార్జునసాగర్ నీటిని విడుదల చేయాలని తెలంగాణను ఆదేశించాలని కోరుతూ కృష్ణా నది జలాల నిర్వహణ బోర్డుకు ఏపీ జలవనరులశాఖ లేఖ రాసింది. నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల నుంచి ఏడు టీఎంసీల నీటిని అత్యవసరంగా విడుదల చేయాలని కోరింది. నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి ఆరు టీఎంసీలు, ఎడమ కాలువ నుంచి రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు ఒక టీఎంసీ నీటిని విడుదల చేసేలా తెలంగాణ అధికారులను ఆదేశించాలని లేఖలో పేర్కొంది. కృష్ణానది బేసిన్‌లో తమకు కేటాయించిన వాటాలో 163 టీఎంసీలను ఏపీ ఇంకా వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణ 326 టీఎంసీలు మాత్రమే వినియోగించుకోవలసి ఉన్నప్పటికీ, 417 టీఎంసీల నీటిని వాడుకుందని పేర్కొంది. ఏపీ తన వాటాలో 53శాతం నీటిని వినియోగించుకుందని, ఇంకా ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి 126 టీఎంసీల నీటిని వాడుకునే అవకాశం ఉందని వెల్లడించింది. తమ తక్షణ అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని ఎండిపోతున్న పంటలు, తాగునీటి అవసరాల దృష్ట్యా ఏడు టీఎంసీల నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్వహణ బోర్డును జలవనరులశాఖ కోరింది.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం

తిరుపతి ప్రచారభేరిలో హరినాథరెడ్డి, నాగరాజు

విశాలాంధ్ర-తిరుపతి: అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకు పోరాటం కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు స్పష్టం చేశారు. అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా సీపీఐ, సీపీఎం నేతలు ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. 'మోదీని గద్దె దించండి- దేశాన్ని కాపాడండి' నినాదంతో సీపీఐ, సీపీఎం దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రచారభేరిలో భాగంగా శుక్రవారం తిరుపతి అంబేద్కర్ విగ్రహం నుండి నాలుగు కాళ్ల మండపం వరకు పాదయాత్ర చేశారు. హరినాథరెడ్డి, నాగరాజు మాట్లాడుతూ మోదీ 9 ఏళ్ల పాలనలో దళితులపై దాడులు పెరిగాయని, ప్రజాస్వామ్యం, లౌకికవాదం ప్రమాదంలో పడ్డాయని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. నిరుద్యోగం పెరిగిపోయిందని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని వివరించారు. రాజ్యాంగబద్ధ సంస్థలు ఈడీ, సీబీఐ, ఐటీ, చివరికి న్యాయవ్యవస్థను సైతం తమ గుప్పెట్లో పెట్టుకొని ఇష్టానుసారం పాలన చేస్తున్నారని చెప్పారు. విపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారని, కొందరిని ఎన్నికలకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. 2014 ఎన్నికల ముందు మోదీ, బీజేపీ లెక్కకు మించి హామీలిచ్చారని, ఒక్కటీ అమలు చేయలేదని నిందించారు. మన రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని, ప్రత్యేక హోదా, పోలవరానికి పూర్తిస్థాయిలో నిధులు, రాజధాని నిర్మాణం, రాయలసీమ-ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన చట్టంలో పేర్కొన్న హామీలేవీ పరిపూర్తి చేయలేదని దుయ్యబడ్డారు. విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మకానికి పెట్టిన మోదీ ప్రభుత్వంపై వైసీపీ, టీడీపీ, జనసేన నోరుమెదపకపోవడం ఆశ్చర్యంగా ఉందని వ్యాఖ్యానించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో దళితులపై దాడులు పెరిగి పోతున్నాయన్నారు. సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లుతున్నాయన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు కుమార్‌రెడ్డి, నదియా, సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు జల్లా విశ్వనాథ్, టి.సుబ్రహ్మణ్యం, సీపీఐ నాయకులు బండి చలపతి, ఉదయ్ కుమార్, కత్తి రవి, ఎండీ రవి, ఎస్.శివ, కేవై రాజా, రామకృష్ణ, శ్రీరాములు, బలరాం, కాలయ్య, రామచంద్ర మునీశ్వర్, ఏపీ బాల, శీను, నవీన్ సురేశ్, పూర్ణ, సూరి, ప్రమీల, విజయ, అలివేలమ్మ, అఖిల, హరిత, సీపీఎం నాయకులు మాధవ్, సాయిలక్ష్మి, హేమలత, బుజ్జి, జయంతి, వేణు, మునిరాజా, నరేంద్ర, రాధాకృష్ణ, ఎన్‌డీ శ్రీను, చిన్న, మల్లికార్జునరావు, రమేషు, రాజు, పార్థసారథి, రవి, అక్బర్ పాల్గొన్నారు.

మోసపూరిత మోదీని

గద్దె దింపుదాం: రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: మోసపూరిత మోదీని గద్దె దింపుదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం కర్నూలు జిల్లా, పత్తికొండలో అంబేద్కర్ సర్కిల్‌లో సీపీఐ, సీపీఎం అధ్వర్యంలో 'ప్రచార భేరి' పాదయాత్రను రామచంద్రయ్య జెండా ఊపి ప్రారంభించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామచంద్రయ్య మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100రోజుల లోపు అన్ని రకాల వస్తువుల ధరలను తగ్గిస్తామని, నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన మోదీ అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ అమలు

చేయలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను ఆకాశాన్ని అంటే విధంగా పెంచేశారన్నారు. మోదీ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు అప్పగిస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు డి.రాజా సాహెబ్, రంగారెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, వామపక్ష ప్రజా సంఘాల నాయకులు సురేంద్ర కుమార్, తిమ్మయ్య, కారన్న, కృష్ణయ్య, వెంకటేశ్వర రెడ్డి, కాశన్న, పెద్ద ఈరన్న, వైఎన్‌వెంకట రాముడు, నెట్టికంటయ్య ,రంగన్న, మునిస్వామి, మాదన్న, రాజప్ప పాల్గొన్నారు.

మోదీతో రాజ్యాంగం నిర్వీర్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ విమర్శ

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: మోదీ హటావో- భారత్ బచావో నినాదంతో సీపీఐ, సీపీఎం జాతీయ సమితి పిలుపులో భాగంగా అనంతపురం జిల్లాలో శుక్రవారం ప్రచారభేరి ప్రారంభమైంది. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టవర్ క్లాక్ వరకు ప్రదర్శన జరిగింది. టవర్ క్లాక్ కూడలి వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జగదీశ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక కార్యక్రమాలు, వైఫల్యాలను గ్రామగ్రామాన తెలియజేసి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామని స్పష్టం చేశారు. దేశ భవిష్యత్ కోసం అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రధాని మోదీ నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. మత రాజకీయాలతో ప్రజల్లో అలజడి రేపుతున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. మోదీ ప్రధానిగా కొనసాగితే ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని స్పష్టంచేశారు. 2024 ఎన్నికల్లో మోదీకి చరమగీతం పాడేందుకు ప్రజలందరూ సంసిద్ధం కావాలని జగదీశ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు నల్లప్ప, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, లింగమయ్య, రమణ, సంతోశ్‌కుమార్, రాజేశ్‌గౌడ్, చిరంజీవి,

పద్మావతి, సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు నాయుడు, వెంకట నారాయణ, వలి, ముస్కిన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుల్లాయ్‌స్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

సంపాదకీయం

విశాఖ ఉక్కుపై నిరర్థక రాజకీయాలు

నరేంద్ర మోదీ మంత్రివర్గంలో హేమా హేమీలకే దిక్కు లేనప్పుడు జనానికి బొత్తిగా పరిచితం కాని కేంద్ర ఉక్కు శాఖ సహాయమంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే చేసిన ప్రకటనకు విలువ లేదని ఆ మర్నాడే రుజువైంది. విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని సదరు మంత్రి చెప్పారంటున్నారు. ఇది కేవలం గాలి వార్త అని కేంద్ర ఉక్కు గనుల మంత్రిత్వ శాఖ చేసిన విస్పష్టమైన ప్రకటనతో తేలి పోయింది. విశాఖపట్నం ఉక్కు కర్మాగారం రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ (ఆర్.ఐ.ఎన్.ఎల్.) అధీనంలో ఉంటుంది. ఆర్.ఐ.ఎన్.ఎల్.లో పెట్టుబడులను ఉపసం హరించే ప్రక్రియ కొనసాగుతుందని గురువారం కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అంటే విశాఖ ఉక్కుని ప్రైవేటీకరించే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం విడనాడలేదు. అంటే ఫగ్గన్ చేసిన ప్రకటన అయినా తప్పయి ఉండాలి లేదా ఆయన మాటకు బొత్తిగా విలువలేదనైనా అనుకోవాలి. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం చేసిన ప్రతిపాదనల్లా విశాఖ ఉక్కుకు ముడి సరుకు సరఫరా చేసే ఉద్దేశం ఉన్న వారు ముందుకు రావచ్చునని ఆహ్వానించడమే. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కొనడానికి తాము సిద్ధం అని తెలంగాణ ముఖ్యమంత్రి కె.సి.ఆర్. ప్రకటించడమే ఆశ్చర్యకరం. కానీ అదీ వివాదాస్పదమైంది. మరి కేంద్రం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మితే కొంటామని కె.సి.ఆర్. ప్రకటించారంటే ఎక్కడో తికమక ఉండి ఉండాలి. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడానికి వ్యతిరేకమని భారతీయ రాష్ట్ర సమితి (మునుపు తెలంగాణ రాష్ట్ర సమితి–టి.ఆర్.ఎస్.) నాయకులు అంటున్నారు. ఆ మాట నిజమే అనుకున్నా కేంద్ర ప్రభుత్వం అనేక ప్రజా వ్యతిరేక చర్యలు తీసుకున్నప్పుడు, వివాదాస్పదమైన వ్యవసాయ చట్టాలు ఆమోదించినప్పుడు కె.సి.ఆర్. పార్టీ వ్యతిరేకించిన దాఖలాలు ఉన్నాయేమో కాగడా పెట్టి వెతకాల్సిందే. విశాఖ ఉక్కుని తెలంగాణ ప్రభుత్వం కొనడం ఎలా కుదురుతుంది అని ప్రశ్నిస్తున్న ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వమూ పార్లమెంటులో మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించిన దాఖలాలు లేవు. కానీ ఇప్పటిదాకా తెలంగాణ ప్రభుత్వం కొనడానికి బిడ్ వేయనే లేదని గుడివాడ అమర్ నాథ్ వాదిస్తున్నారు. ఈ విషయమై అధికారిక ప్రకటన కూడా వెలువడలేదంటున్నారు. ఒక వేళ అది నిజమైనా సాధ్యమయ్యే పని కాదంటున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల అధికార పక్ష నాయకుల వాద వివాదాలు ఎలా ఉన్నా మరో విచిత్రం ఉంది. కె.సి.ఆర్. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకించిన మాట నిజమే అనుకున్నా తాము కొంటామనడం ప్రైవేటీకరణను సమర్థించడమే కదా అని గుడివాడ అమర్ నాథ్ మరో ప్రశ్న లేవనెత్తారు. వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ముందు నుంచీ విశాఖ కర్మాగార ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూనే ఉందని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు ఒకరు చెప్తున్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నష్టాల నుంచి బయట పడేయడానికి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి అనేక సూచనలు చేశారని కూడా ఆయన అంటున్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి ఇనుప ఖనిజ గనులు ప్రత్యేకంగా కేటాయించాలని కూడా జగన్ సూచించారట. అదీ నిజమే అనుకుందాం. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలన్న ఆలోచన మొదలైనప్పటి నుంచీ ఆ పరిశ్రమ కార్మికులు నిరంతరం ఆందోళన చేస్తూనే ఉన్నారు. ఆ ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న కార్మిక సంఘాలు అటు తెలంగాణ, ఇటు ఆంధ్ర ప్రభుత్వ అనుకూల సంఘాలు కాకపోవచ్చు. కానీ రెండు తెలుగు రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు గానీ, ఆ పార్టీల నాయకులుగానీ విశాఖ ఉక్కును ఎలాగైనా పరిరక్షించుకోవాలని పాటు పడ్తున్న కార్మికుల పోరాటానికి మద్దతు ఇచ్చిన సందర్భాలూ కనిపించవు. విశాఖ ఉక్కు వ్యవహారాన్ని అధికారంలో ఉన్న రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ రాజకీయ దృక్కోణం నుంచే చూస్తున్నాయి. కాని "విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు" అని సుదీర్ఘ కాలం ఉద్యమం నిర్వహించి, ప్రాణ త్యాగాలు కూడా చేసిన వారి పోరాటానికి ఏ మాత్రం విలువ ఇవ్వడం లేదు. ఇప్పుడు ఆ కర్మాగారాన్ని కొంటామంటున్న ప్రభుత్వం గానీ, ఎలా కొంటారని నిలదీస్తున్న ప్రభుత్వం గానీ కనీసం పోరాడు తున్న కార్మికులకు సానుభూతి తెలియజేసినా జనం వారి మాటలను నమ్మడానికి అవకాశం ఉండేదేమో. చంద్రబాబు హయాం నుంచి మొదలు పెడితే ఇప్పటిదాకా ఏ తెలుగు నాయకుడూ నికరంగా ప్రభుత్వ రంగ పరిరక్షణకు కట్టుబడిన ఉదంతమే లేదు.

విశాఖ ఉక్కుకు నేషనల్ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ టన్ను ముడి సరుకు ఆరేడు వందల రూపాయలకు అంటే తమకు అయిన ఖర్చు మేరకే వసూలు చేసి సరఫరా చేసేది. ఆ సంస్థ కార్పొరేట్ రూపం దాల్చిన తరవాత ఇప్పుడు ఆ ధర కనీసం పదింతలు పెరిగింది. విశాఖ ఉక్కును అమ్మడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం న్యాయసంబంధ వ్యవహారాలు పరిశీలించడానికీ, ఆ కర్మాగారం నికరంగా ఎంత విలువ చేస్తోందో లెక్క కట్టడానికీ రెండు కమిటీలను నియమించింది. ఆ కమిటీలు తమ పని తాము చేసుకుపోతున్నాయి. ఏ దశలోనూ జగన్ కానీ, కె.సి.ఆర్. కానీ కేంద్ర విధానాన్ని వ్యతిరేకించలేదు. కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు చేసిన ప్రతిపాదనల్లా ఆసక్తిగల వారు ఎవరైనా తమ ముడి సరుకు తాము తెచ్చుకుని, ఉక్కు తయారు చేసి విశాఖ ఉక్కు కర్మాగారానికి అద్దె డబ్బులు చెల్లించి తీసుకుపోవచ్చు. నిజానికి ఉక్కు కర్మాగారానికి ప్రత్యేకంగా ఇనుప గనులు కేటాయించి ఉంటే లాభాలు సమకూరేవి. చాలా సందర్భాలలో ఆ కర్మాగారం లాభాలు సంపాదించింది కూడా. కేంద్రం చెప్తున్న ఆర్థిక సరళీకరణ విధానాలవల్ల కూడా ఉక్కు కర్మాగారానికి ఒరిగిందేమీ లేదు. కర్మాగారాన్ని నడపడానికి 13 లేదా 14 శాతం వడ్డీకి ఆ సంస్థ అప్పులు తీసుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు ఆ వడ్డీ రేట్లు దాదాపు పది శాతం దరిదాపుల్లో ఉన్నాయి. కానీ ఆ అప్పులను రీషెడ్యూల్ చేసిన పాపాన పోలేదు. ప్రైవేటీకరణ ప్రస్తావన వచ్చినప్పుడే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ మహా సంస్థను పరిరక్షించే పని చేసి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది. కానీ కేంద్ర ప్రభుత్వానికి పక్క వాద్యకారులుగా ఉండడంతోనే సరిపోయింది. ఇప్పుడు రాజకీయాలు చేయడంవల్ల ఫలితం ఏమీ లేదు.

నట 'బ్రహ్మా' రూపం

బ్రహ్మానందం తెలుసుకదా.. తెరమీద కనపడగానే నవ్వుల పువ్వులు పూయించిన బ్రహ్మానందం అనుకుంటున్నారు కదా! అవును ఆయనే కాని, నట విశ్వరూప బ్రహ్మానందాన్ని చూడలేదు కదా! ఇన్నాళ్లు తెరపై వెకిలి నవ్వులు, దెబ్బలు తినడాలు, లేదూ తినిపించుకోవడాలు చేస్తున్న బ్రహ్మా నందం కాదు. అసలు సిసలు నటనతో కన్నీళ్లు కార్పించిన బ్రహ్మానందాన్ని చూడాలనుకుంటున్నారా! మళ్ళీ ఆ అవకాశం వస్తుందో రాదో రంగ మార్తాండ సినిమా చూడండి. ఈ బ్రహ్మానందాన్ని ఇన్నాళ్లు తెలుగు తెర ఎందుకు వెకిలిగా చూపించిందో అని దిగులు వేస్తుంది.. కోపం వస్తుంది.. ప్రేక్షకుల్ని నవ్వించడం కోసం మూడున్నర దశాబ్దాలుగా తనను తాను హింసించుకున్న బ్రహ్మానందం ఇప్పుడు ఆ ప్రేక్షకుడి కంట కన్నీరు కార్పించేందుకు తన నటనా విశ్వరూపాన్ని చూపించారు.

7వ దశకం నుంచి తెలుగు నాటక రంగాన్ని దేదీప్యమానంగా వెలిగించిన అనేకానేక మంది తెలుగు నాటకాల్లోని పాత్రలు రంగ మార్తాండలో అలా కళ్ళముందు కదలాడుతాయి. రంగమార్తాండ సినిమా ప్రారంభం కాగానే నాకు ప్రకాష్ రాజ్ కనపడలేదు. మన నాటకాన్ని అగ్రభాగాన నిలిపిన పద్మశ్రీ ఎస్.ఆర్. కృష్ణ, రాజా రాందాస్, మొదలి నాగభూషణ శర్మ, చాట్ల శ్రీరాములు కళ్ల ముందు కదలాడారు.

ప్రకాష్ రాజ్ తన అనుభవాలను చెప్తూ "మా చక్రిగాడు... చక్రధర్

చక్రవాకం

– ముక్కాము చక్రధర్

అయితే" అంటూ ఆ పాత్రలో వున్న బ్రహ్మానందాన్ని చూపిస్తుంటే కళ్ళముందు తల్లావఝుల సుందరం కదలాడారు. ఆ సీన్ లో వెండితెర మీద మిత్రుడు తనికెళ్ళ భరణి వున్నారు కాని సాక్షాత్ రంగస్థలం మధ్యలో ఉన్నట్లుగానే అనిపించింది. ఆ మహానటులు, దర్శకులను తెలుగు నాటక రంగం కొన్ని సంవత్సరాల పాటూ కడుపుతో ఉండి వీళ్ళకి జన్మనిచ్చిందేమో అనిపించింది. ఆ కుదురులోంచి వచ్చిన వాళ్ళే బ్రహ్మానందం, కోట శ్రీనివాసరావు, ఎం.ఎస్.నారాయణ వంటి వారు. ఈ అద్భుత రంగస్థల నటుల్ని వెండితెర "కామెడీ" గా చంపేసింది. బ్రహ్మానందాన్నైతే గుర్తుపట్టలేనంతగా వెకిలి చేష్టలు చేయించి మరీ చంపేసింది.

ఈ దుఃఖం పోయేందుకు అప్పుడెప్పుడో "బాబాయ్ హొటల్" అంటూ బ్రహ్మానందాన్ని కరుణ రూపంలో చూపించేందుకు ప్రయత్నించారు. అయితే, తెలుగు ప్రేక్షకులు దెబ్బలు తింటూ నవ్వించే బ్రహ్మానందమే కావాలనుకున్నారు కానీ ఆయన చూపించిన కరుణను కాసింతైనా అంగీకరించలేదు. మళ్ళీ ఇదిగో ఇన్నాళ్లకు రంగమార్తాండలో అసలు సిసలు బ్రహ్మానందాన్ని చూసి "ఇంత గొప్ప నటుడ్ని ఎలా మిస్ అయ్యాం" అనుకుంటున్నారంతా.

మాసిన గడ్డం, మోకాళ్ళ పైకి లాల్చీ, కళ్లద్దాలు, చేతిలో మందు బాటిల్. ఇదీ బ్రహ్మానందం ఆహార్యం రంగమార్తాండ సినిమాలో . తెలుగు నాటక రంగంలో దాదాపుగా నటులందరి ఆహార్యం అదే నిత్య జీవితంలో. కొందరి చేతుల్లో మందు బాటిల్ లేదేమో.. మోకాళ్ళ వరకూ నిక్కరు, బొమ్మల చొక్కాలు, తన మొఖం మీద తాను కొట్టుకుంటూ నవ్వు తెప్పించేందుకు ప్రయత్నించే బ్రహ్మానందాన్ని చూసిన తెలుగు ప్రేక్షకులు రంగమార్తాండలో బ్రహ్మానందాన్ని చూసి అవాక్కయ్యారు. ఇది మొదటి షాక్ అయితే, తన స్నేహితుడి పిల్లల దగ్గరికి వాళ్ళ ఆఫీసుకే మందు బాటిల్ తో వచ్చి వాళ్లకి చివాట్లు పెడుతూ మధ్య మధ్యలో గొంతులో కొన్ని మందు చుక్కలు పోసుకుంటున్న బ్రహ్మానందాన్ని చూసి తేరుకోలేని షాక్.

తన భార్య మరణించినప్పుడు, తనని ఏకాకి చేసిన తన స్నేహితుడు రాఘవరావు పాత్రధారి ప్రకాష్ రాజ్ వచ్చినప్పుడల్లా బ్రహ్మానందం లోని నట విశ్వరూపం చూసి చొక్కాలు, చీరలు ఎందుకో తడిసాయో ఎప్పటికీ సమాధానం లేని ప్రశ్న. ఇది చూసాక... ప్రేక్షకులు "ఇన్నాళ్లా ఎంత పోగొట్టుకుంటున్నాం ఈ నటుడి నుంచి" అనుకున్నారు.

"ముక్తి ప్రసాదించరా" అని బ్రహ్మానందం... ప్రకాష్ రాజ్‌ని అడిగాడు కాని ఈ చెత్త కామెడీ నుంచి దర్శకుడు కృష్ణవంశీయే బ్రహ్మానందానికి ముక్తి ప్రసాదించినట్లు అనిపించింది.

"మీరు చూస్తున్నారు మేం తీస్తున్నాం" అనే చెత్త ప్రకటనలు ఆపి "మీరు తీయడంవల్లే గతిలేక ప్రేక్షకులు చూస్తున్నారు" అని ఈ దర్శక, నిర్మాతలకి చెప్పాలనిపించింది రంగమార్తాండ సినిమాలో బ్రహ్మానందాన్ని చూస్తే.. గొప్ప నటనను లోపల దాచేసుకున్న బ్రహ్మానందానికి, అది చూడలేకపోతున్న ప్రేక్షక లోకానికి ఆ చెత్త నుంచి ముక్తి ప్రసాదించండని ముక్త కంఠంతో కోరుతున్నాం..

బ్రహ్మానందం గారూ.. బలహీనులం.. సినిమా చూడకుండా ఉండలేం..అప్పుడప్పుడైనా రంగమార్తాండలో పాత్ర వంటివి చేస్తూ మాకు ముక్తి ప్రసాదించరూ...

సీనియర్ జర్నలిస్ట్, 9912019929

కర్ణాటక బీజేపీలో భగ్గుమన్న అసమ్మతి

టీవీఎస్

కర్ణాటక పాలక బీజేపీలో ముఠా కుమ్ములాటలు, అసమ్మతి ఒక్కసారిగా భగ్గుమన్నాయి. రాష్ట్ర అసెంబ్లీకి మే నెల 10వ తేదీన జరగనున్న ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల తొలి, మలి జాబితాను ప్రకటించిన వెంటనే టిక్కెట్లు దక్కని దాదాపు ఏడుగురు ఎమ్మెల్యేలు, మాజీ ఉపముఖ్యమంత్రి లక్ష్మణ్‌సవది బీజేపీపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. లక్ష్మణ్ ఏకంగా పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ప్రకటించారు. చాలా చోట్ల నిరసన ప్రదర్శనలు చేశారు. 224 అసెంబ్లీ స్థానాలకుగాను మరో పదిస్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించవలసి ఉంది. మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పకు పలుకుబడిగల లింగాయత్‌లలో అత్యధికంగా పోటీ అభ్యర్థులను ఎంపిక చేశారని బొమ్మయ్ వర్గం గుర్రుగా ఉన్నారని వార్తలు. టిక్కెట్లురాని వారిలో ఇటీవల 40లక్షల లంచం తీసుకుంటూ (కొడుకుద్వారా) పట్టుబడి అరెస్టయిన విరూపాక్షప్ప, అవినీతి ఆరోపణలలో కూరుకుపోయిన మాజీ మంత్రి కెఎస్‌ఈశ్వరప్పలు బీజేపీని వీడనున్నట్లు వార్తలు. మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్‌ను యువతకు అవకాశం ఇవ్వాలని పార్టీ నాయకత్వం కోరగా తిరస్కరించి తాను చివరిసారిగా పోటీ చేయవలసిందేనని భీష్మించారు. అంతిమంగా ఇండిపెండెంట్‌గానైనా పోటీ చేయాలని భావిస్తున్నారు. అలాగే ముదిగిరె ఎంఎల్‌ఏ, ఎంపి కుమారస్వామి, హావేరి ఎంఎల్‌ఏ ఒలేకర్‌లు బీజేపీ సభ్యత్వానికి గురువారం రాజీనామా చేసి తిరుగుబాటు చేశారు. దాదాపు పదిమంది ఎంఎల్‌ఏలు ఇంతవరకు తీవ్ర అసమ్మతిని వ్యక్తం చేస్తూ రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. వీరుగాక మరికొందరు ఎంఎల్‌ఏలు, కార్పొరేషన్లలో అనేకమంది ఎంఎల్‌ఏల అనుచరులైన కార్పొరేటర్లు రాజీనామా చేసి పార్టీ నాయకత్వానికి షాక్ ఇచ్చారు.

ఈసారి ఓటమి తప్పదని సర్వేల అంచనాలు వెల్లడవుతున్నదశలో ముస్లింలకు గత 4శాతం రిజర్వేషన్లను రద్దుచేసి లింగాయత్‌లకు రెండు, ఒక్కలిగలకు రెండుశాతం కేటాయిస్తూ బొమ్మయ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి

మాజీ ఉపముఖ్యమంత్రి లక్ష్మణ్ సవది

తగినాధారాలులేవని, లోపభూయిష్టమైన నిర్ణయమని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలియజేసింది. బొమ్మయ్ ప్రభుత్వం ఇప్పుడు అత్యవసరంగా ముస్లింలకు రిజర్వేషన్లు రద్దుచేసి మరో రెండువర్గాలకు కేటాయించవలసిన అవసరం ఏమొచ్చిందని న్యాయమూర్తులు కె.ఎంజోసెఫ్, బివి నాగరత్నలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ఈ నిర్ణయాన్ని సవాలుచేస్తూ దాఖలైన పిటిషన్‌లపై ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్లకు సమాధానం ఇవ్వడానికి ఏప్రిల్ 17వరకు సర్వోన్నత న్యాయస్థానం గడువిచ్చింది. ముస్లింలకు రిజర్వేషన్లు రద్దు చేయడానికి కచ్చితమైన సమాచారంలేదని, దీనిపై సమగ్ర అధ్యయనమూ లేదని ముస్లింల తరఫున వాదించిన సీనియరు న్యాయవాదులు కపిల్‌సిబల్, దుష్యంత్ దవేలు పేర్కొన్నారు.

సమాధానం దాఖలు చేయడానికి కొంత సమయం కావాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కర్ణాటక తరఫున వాదిస్తూ కోరారు. మార్చి 20వ తేదీన బొమ్మయ్ జారీచేసిన జీఓ ప్రకారం జవాబు దాఖలు చేసేలోపు ఎలాంటి నియామకాలు చేపట్టవద్దని ధర్మాసనం ఆంక్షలు విధించింది. లోపభూయిష్టమైన అంచనాలతో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని తమకు సమర్పించిన పత్రాలు తెలియజేస్తున్నాయని ధర్మాసనం తెలిపింది. అసలే తిరుగుబాట్ల తలనొప్పులతో సతమవుతున్న బీజేపీ నాయకత్వానికి సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలుసైతం నష్టం కలిగించేవేనని విశ్లేషకులు భావిస్తున్నారు. అవినీతికి మారుపేరుగా నిలిచిన ప్రభుత్వంపై ప్రజలలో ప్రత్యేకించి ఒక్కలిగలలో వ్యతిరేకత ఏర్పడిందని గ్రహించిన బీజేపీ నాయకత్వం ఈ నిర్ణయానికి కారణం.

తమది క్రమశిక్షణకు మారుపేరని,అవినీతి అంటని పార్టీ అని బీజేపీ అధినాయకత్వం చెప్పుకునే గొప్పలన్నీ నీటి బుడగలేనని కర్ణాటక పరిస్థితి అద్దం పడుతోంది. మరోవైపు కాంగ్రెస్‌లోనూ సిద్ధరామయ్య, డీకె శివకుమార్ గ్రూపులున్నప్పటికీ బీజేపీలో కుమ్ములాటలు బైటపడినట్లుగా పెద్దగా సమస్యకాలేదు. ఇక కాంగ్రెస్ మాజీ ఎంపీ రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రకు రాష్ట్రంలో గణనీయమైన స్పందన లభించడం పార్టీ శ్రేణులలో ఉత్సాహాన్ని నింపింది. ఈసారి కాంగ్రెస్‌కే విజయావకాశాలున్నాయని చాలా సర్వేలు అంచనావేశాయి. అయితే కులాల ప్రాతిపదికపైన, మతాల మధ్య విద్వేషప్రచారం ద్వారా ఓట్లు పొందడానికి బీజేపీ అనేక మాయోపాయాలను పన్నుతుంది. ఈ ధోరణి అన్ని రాష్ట్రాల్లోనూ అనుసరిస్తున్నది. ఇక అపారంగా తన వద్దగల నిధులను బీజేపీ వినియోగిస్తుందన్న విషయం బహిరంగ రహస్యం. రాహుల్ గాంధీ తనను వేధించినా, ఎంపీగా అనర్హుడిగా ప్రకటించినా, జైలులో నిర్బంధించినా సత్యం కోసమే నిలబడతానని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పరిరక్షణకు పోరాడతానని పదేపదే చెప్తున్న మాటలు కూడా సామాన్యజనాన్ని సైతం ఆకట్టుకున్నాయని విశ్లేషకులు తెలియజేస్తున్నారు. అలాగే కర్ణాటక ఒకసారి ఒక పార్టీకి ప్రజలుపట్టం కడితే రెండవసారి అదే పార్టీ అధికారానికి రావడంలేదు. 1985 నుంచి ఈ సాంప్రదాయం కొనసాగుతోంది. టిప్పుసుల్తాన్‌ను ఒక్కలిగల నాయకులిరువురు చంపివేశారని, బ్రిటీష్ వాళ్లతో చేసిన యుద్ధంలో చనిపోలేదని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు చేస్తున్న ప్రచారంపై ఒక్కలిగలు తీవ్ర ఆగ్రహంతోఉన్నారు. టిప్పుసుల్తాన్‌ను అడ్డుపెట్టుకొని ఓట్లు పొందాలన్న కుయుక్తి తమకే నష్టం కలుగుతుందని బీజేపీ నాయకత్వం ఆందోళన చెందుతోంది. ఈ పరిణామాలన్నీ నాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గెలుపుపై విశ్వాసం కలగడంలేదని రాష్ట్ర నాయకులే ప్రైవేటుగా అభిప్రాయ పడుతున్నారని వార్తలు వస్తున్నాయి.

ఓట్లకోసం చర్చి ప్రార్థనల్లో మోదీ!

సత్య

వచ్చే ఎన్నికల్లో కూడా నరేంద్రమోదీ ప్రధానిగా ఉంటారని మోదీ అంతరంగం అమిత్ షా చెప్పారు. మోదీ వేస్తున్న పిల్లి మొగ్గల గురించి కేరళ సిఎం పినరయి విజయన్ ఎద్దేవా చేశారు. ఏప్రిల్ తొమ్మిదవ తేదీన ఈస్టర్ పండగనాడు ప్రధాని నరేంద్రమోదీ తన మద్దతుదారులైన యావత్ హిందూత్వశక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ అధికారం తరువాతే అన్నీ అన్న సందేశమిస్తూ దిల్లీలోని శాక్రెడ్ హార్ట్ చర్చ్‌ను సందర్శించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. మామూలుగా అయితే ఎవరైనా ప్రార్థనా స్థలాలకు వెళ్లటాన్ని తప్పు పట్టనవసరం లేదు. అది వారి వ్యక్తిగత అంశం. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతవేత్త ఎంఎస్ గోల్వాల్కర్ తన "బంచ్ ఆఫ్ థాట్స్" (ఆలోచనల గుత్తి) అనే పుస్తకంలో దేశ అంతర్గతశత్రువులలో క్రైస్తవులు ఒకరు అని సెలవిచ్చారు. నరేంద్రమోదీ వంటి ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకులు అవసరమైతే భగవద్గీతను పక్కన పెట్టి గోల్వాల్కర్ రచనను ప్రమాణంగా తీసుకొని పాటిస్తారన్నది తెలిసిందే. మరి ఇప్పుడు తమ గురువును పక్కన పెట్టి మోదీ చర్చికి వెళ్లి సామరస్యత గురించి సుభాషితం పలకటాన్ని చూసి దెయ్యాలు వేదాలను వల్లించినట్లుగా భావిస్తున్నారు.

గతంలో చేసిన దానికి ప్రాయశ్చిత్తంగా చర్చికి వెళ్లి ఉంటే మంచిదే, ఇది అదేనా? రక్తం రుచి మరిగిన పులి భిన్నమైన దానికి మొగ్గు చూపుతుందా, మరోదారిలో వెళు తుందా ? అని పినరయి విజయన్ ప్రశ్నించారు. బీజేపీ నేతలు కేరళలోని బిషప్‌ల ఇళ్లను సందర్శిస్తున్నారు. కేరళ వెలుపల క్రైస్తవుల మీద వేట సాగిస్తున్నారు. ఇక్కడ వారు అలాంటి వైఖరి తీసుకోలేరు, సంఘపరివార్‌కు ఇక్కడ మైనారిటీల మీద ఏదైనా ప్రత్యేక ప్రేమ ఉందా ? ఇక్కడ గనుక మతతత్వ వైఖరి తీసుకొని మతఘర్షణలను సృష్టిస్తే ప్రభుత్వం కఠిన వైఖరి తీసుకుంటుంది, దీనిలో ఎలాంటి రాజీలేదు అని స్పష్టం చేశారు. సంఘపరివార్ అసలు రంగేమిటో జనం చూస్తున్నారు, క్రైస్తవ సమాజానికి తాము దగ్గర అవుతున్నట్లు చూపేందుకు నానా తంటాలు పడుతున్నారు. కేరళలో పాగా వేసేందుకు తమ పుస్తకంలోని అన్ని జిమ్మిక్కులను ప్రయోగిస్తున్నారు అన్నారు. కేరళ టూరిజం మంత్రి మహమ్మద్ రియాజ్ మాట్లాడుతూ ఆస్ట్రేలియన్ మిషినరీ గ్రాహమ్ స్టెయిన్, అతని కుమారులు ఫిలిప్, తిమోతీలను సజీవ దహనం చేయటాన్ని సంఘపరివార్ ఇప్పటికీ సమర్థిస్తున్నది అన్నారు. భజరంగ్ దళ్‌కు చెందిన దారాసింగ్‌కు కోర్టు శిక్ష విధించింది. అతను బీజేపీలో కూడా పని చేశాడు. కనీసం 89 మంది పాస్టర్ల మీద దాడులు, 68 చర్చ్‌ల విధ్వంసం, ప్రార్థనల మీద దాడులు జరిగినట్లు కూడా రియాజ్ చెప్పారు. ఇవన్నీ ఒక పథకం ప్రకారం బంచ్ ఆఫ్ థాట్స్ పుస్తకంలో చెప్పిన భావజాలం మేరకే జరిగాయన్నారు. గత రెండు సంవత్సరాల్లో క్రైస్తవుల మీద జరిగిన దాడులకు సంబంధించి వెయ్యికిపైగా కేసుల వివరాలను దిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న యునైటెడ్ క్రిస్టియన్ ఫోరమ్ (యుసిఎఫ్) వెల్లడించింది. మోదీ చర్చి సందర్శన తరువాత అలాంటి దాడులు ఆగిపోతాయనే ఆశ క్రైస్తవుల్లో కలిగిందని క్రైస్తవ వార్తా సంస్థ యుసిఏ పేర్కొన్నది. హిందూ అనుకూల భారతీయ జనతాపార్టీ నేత 2014లో ప్రధాని అయిన తరువాత తొలిసారి చర్చిని సందర్శించినట్లు కూడా పేర్కొంది. ఇరవై ఐదు నిమిషాలపాటు మోదీ ఈ చర్చిలో గడిపారు.

ఈస్టర్ ఆదివారం నాడు మోదీ ఢిల్లీలోని ఒక కాథలిక్ చర్చిని అసాధారణంగా సందర్శించారని క్రిస్టియన్ పోస్ట్ అనే పత్రిక పేర్కొంది. మైనారిటీ సామాజిక తరగతుల మీద దాడులకు పేరుమోసిన హిందూ జాతీయవాద పార్టీ నేత క్రైస్తవ ఓటర్లకు దగ్గరయేందుకు చూశారని ఆ పత్రిక వ్యాఖ్యానించింది. దిల్లీ మైనారిటీ కమిషన్ మాజీ సభ్యుడు

ఈస్టర్ ఆదివారం నాడు మోదీ ఢిల్లీలోని ఒక కాథలిక్ చర్చిని అసాధారణంగా సందర్శించారని క్రిస్టియన్ పోస్ట్ అనే పత్రిక పేర్కొంది. మైనారిటీ సామాజిక తరగతుల మీద దాడులకు పేరుమోసిన హిందూ జాతీయవాద పార్టీ నేత క్రైస్తవ ఓటర్లకు దగ్గరయేందుకు చూశారని ఆ పత్రిక వ్యాఖ్యానించింది. దిల్లీ మైనారిటీ కమిషన్ మాజీ సభ్యుడు ఏసి మైఖేల్ మోదీ సందర్శన సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. క్రైస్తవుల మీద హింసాత్మక దాడులు 2014లో వంద ఉంటే 2022 నాటికి ఆరువందలకు పెరిగినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది తొలి వంద రోజుల్లోనే 200 ఉదంతాలు జరిగాయని అన్నారు.



ఏసి మైఖేల్ మోదీ సందర్శన సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. క్రైస్తవుల మీద హింసాత్మక దాడులు 2014లో వంద ఉంటే 2022 నాటికి ఆరువందలకు పెరిగినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది తొలి వంద రోజుల్లోనే 200 ఉదంతాలు జరిగాయని అన్నారు. దేశమంతటా క్రైస్తవుల మీద జరుగుతున్న దాడుల వివరాలను సమర్పించాలని 2022 సెప్టెంబరు ఒకటవ తేదీ నుంచి సుప్రీంకోర్టు పదేపదే అడిగినా ఇప్పటి వరకు మూడుసార్లు గడువును పెంచాలని కేంద్ర ప్రభుత్వం కోరిందని, బలవంతంగా మతమార్పిడులు చేస్తున్నారనే సాకుతో దాడులు జరుపుతున్నారని, బలవంతపు మతమార్పిడులకు తగిన ఆధారాలు దొరక్కపోవటమే దీనికి కారణమని అన్నారు. క్రైస్తవుల మీద దాడులు, వేధింపుల్లో భారత్ ప్రపంచంలోని అరవై దేశాల్లో పదవ స్థానంలో ఉందని అమెరికాకు చెందిన ఓపెన్ డోర్స్ అనే సంస్థ తన నివేదికలో పేర్కొన్నది. హిందూ ఉగ్రవాదులు దేశంలో క్రైస్తవులు, ఇతర మైనారిటీలను లేకుండా చేసి దేశాన్ని ప్రక్షాళన చేయాలని చూస్తున్నారని కూడా చెప్పింది.

సంఘపరివార్‌కు చెందిన వివిధ సంస్థలకు చెందిన వారు విద్వేష ప్రసంగాలు, ప్రకటనలు చేయటంలో పేరు మోశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంఎల్‌ఏ రామేశ్వర శర్మ ఛాదర్ ముక్త్ – ఫాదర్ ముక్త్ (ముస్లిం, క్రైస్తవ పూజారులు) భారత్ కావాలని బహిరంగంగా చెప్పారు.

దేశంలో ఛత్తీస్‌ఘర్ క్రైస్తవ విద్వేష ప్రయోగశాలగా మారింది. హిందువులు గొడ్డళ్లు ధరించి మతమార్పిడులకు పాల్పడుతున్న క్రైస్తవులకు బుద్ధి చెప్పాలని ఆ రాష్ట్రానికి చెందిన పరమాత్మానంద మహరాజ్ పిలుపునిచ్చారు. ఆ సభలో బీజేపీ నేతలు కూడా ఉన్నారు. ఇలాంటి వారిని అదుపు చేయకుండా తాము మారినట్లు మైనారిటీలను నమ్మించేందుకు, సంతుష్టీకరించేందుకు బీజేపీ నానాపాట్లు పడుతున్నది. కేరళ, క్రైస్తవులు ఉన్న ఇతర ప్రాంతాల్లో బీఫ్‌కు అనుకూలంగా మాట్లాడటమే కాదు, నాణ్యమైన మాంసాన్ని అందిస్తామని కూడా వాగ్దానం చేసిన పెద్దలు ఉన్నారు. కేరళలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సిఎం ఏకె ఆంటోని కుమారుడు అనిల్ ఆంటోనిని బీజేపీ ఆకర్షించింది. కేరళ రాజకీయాల్లో ప్రస్తుతం ఏకె ఆంటోనీ ప్రభావమే పెద్దగా లేదు, అలాంటిది కొడుకు బీజేపీలో చేరి ఆ పార్టీని ఉద్ధరిస్తారన్నది ఆ పార్టీ పేరాశతప్ప మరొకటి కాదు. తనకు 82 సంవత్సరాలని జీవితాంతం కాంగ్రెస్‌లోనే ఉంటానని ఆంటోని చెప్పారు. తన కుమారుడు బీజేపీలో చేరటం బాధాకరమన్నారు. రబ్బరు మద్దతు ధరలను పెంచితే కేరళ క్రైస్తవులు మొత్తం బీజేపీకి మద్దతుదార్లుగా మారతారని ఒక మతాధికారి గతంలో ప్రకటించారు. కానీ కేంద్రం వైపు నుంచి అలాంటి సూచనలేమీ లేవు.

డిస్కమ్‌లకు విద్యుత్ సబ్సిడీపై ఢిల్లీ ప్రభుత్వం ప్రత్యేక ఆడిట్

లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమోదం



న్యూఢిల్లీ : డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు (డిస్కమ్‌లు) 2016-17 నుంచి పంపిణీ చేసిన విద్యుత్ సబ్సిడీ మొత్తాన్ని కేజ్రీవాల్ ప్రభుత్వం ప్రత్యేక ఆడిట్ చేసేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమోదం తెలిపారు. ఇది ఇప్పటివరకు ఆలస్యం కావడంపై 'ఆశ్చర్యం' వ్యక్తం చేసినట్లు ఎల్‌జీ కార్యాలయ అధికారులు శుక్రవారం తెలిపాయి. గత ఆరేళ్లుగా డిస్కమ్‌లకు ఇచ్చిన రూ.13,549 కోట్ల ఆడిట్‌ను ప్రభుత్వం నిర్వహించలేదని సక్సేనా ముఖ్యమంత్రికి రాసిన లేఖలో విమర్శించారు. డిస్కమ్‌లకు ఇస్తున్న మొత్తాలను దొంగిలించకుండా చూసేందుకు ఆడిట్ చేయాలని సూచిస్తూ, పేదలకు విద్యుత్ సబ్సిడీని అందించాలనే తన వైఖరిని ఎల్‌జీ పునరుద్ఘాటించారు. ఏడేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న డిస్కమ్‌ల కాగ్ ఆడిట్‌ను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీం కోర్టులో అప్పీల్‌ను వేగవంతం చేయాలని కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని కోరినట్లు అధికారులు తెలిపారు. బీజేపీ కుట్రతో సక్సేనా సబ్సిడీని ఆపడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన తర్వాత ఢిల్లీలో విద్యుత్ సబ్సిడీపై ఎల్‌జీ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మధ్య వాగ్వాదం జరిగింది. కాగ్ (కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్) ఎంప్యానెల్ చేయబడిన ఆడిటర్‌ల ఆడిట్‌ను కాగ్ ఆడిట్‌కు ప్రత్యామ్నాయంగా పరిగణించరాదని ఎల్‌జీ తన లేఖలో నొక్కి చెప్పారు. ఆప్ ప్రభుత్వం 2015 నుంచి ఢిల్లీ విద్యుత్ నియంత్రణ కమిషన్ (డీఈఆర్‌సీ) ని ఆడిట్ చేయమని కోరుతోంది. అయినప్పటికీ అది విద్యుత్ చట్టం-2003లోని సెక్షన్ 108ని అమలు చేసి, డీఈఆర్‌సీకి కట్టుబడి ఉండేలా ఆదేశాలు ఇవ్వవచ్చు' అని ఎల్‌జీ తన లేఖలో పేర్కొన్నారు. అయితే, డీఈఆర్‌సీ ఎలాంటి ఆడిట్‌ను నిర్వహించలేదు. దీని ఆధారంగా విద్యుత్ శాఖ చీఫ్ సెక్రటరీ ద్వారా డీఈఆర్‌సీని డిసెంబరు 2022లో చట్టాన్ని అమలు చేస్తూ తప్పనిసరిగా ఆడిట్ చేయవలసిందిగా కోరుతూ ఫైల్‌ను పంపింది. ఎల్‌జీ తన లేఖలో ముఖ్యమంత్రికి ఇలా రాశారు. 'ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, విద్యుత్ చట్టం, 2003లోని సెక్షన్ 108ని అమలు చేయడం ద్వారా డీఈఆర్‌సీ ద్వారా ప్రత్యేక ఆడిట్ చేయాలన్న ప్రతిపాదన చాలా ఆలస్యంగా ముందుకు వచ్చింది. డిసెంబరు, 2022లో డిపార్ట్‌మెంట్ ద్వారా జనవరి 27, 2023న అప్పటి ఉప ముఖ్యమంత్రి దానిని తిరస్కరించారు' అని పేర్కొన్నారు. 'ప్రభుత్వం ఎట్టకేలకు విద్యుత్ చట్టం-2003లోని సెక్షన్ 108 కింద తన అధికారాన్ని అమలు చేయడానికి ఆరేళ్లు పట్టడం, ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని డీఈఆర్‌సీకి ఆదేశాలు జారీ చేయడం నాకు మరింత ఆశ్చర్యం కలిగించింది. గత ఆరేళ్లుగా దానిని తెలియజేసినా ప్రయోజనం లేకపోయింది' అని సక్సేనా తెలిపారు. 2016-17 నుంచి 2021-22 వరకు డిస్కమ్‌లకు రూ.13,549 కోట్లు పంపిణీ చేశారు. నెలవారీ 200 యూనిట్ల వినియోగం ఉన్న ప్రజలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందజేస్తోంది. నెలకు 201-400 యూనిట్లు వాడుతున్న వారికి 50 శాతం రాయితీని రూ.850కి పరిమితం చేశారు.

మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా రిటైర్డ్ జిల్లా జడ్జిని సిఫార్సు చేసిన సుప్రీం కొలీజియం

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా రిటైర్డ్ జిల్లా జడ్జి పేరును సుప్రీం కొలీజియం సిఫార్సు చేసింది. సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వ కొలీజియంలో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ కేఎం జోసెఫ్ ఉన్నారు. 1987, సెప్టెంబరు 28న న్యాయ వృత్తిలోకి వచ్చి మధ్యప్రదేశ్ ఉన్నత న్యాయ సేవల్లో సీనియర్ సభ్యునిగా కొనసాగిన రూపేశ్ చంద్ర వర్షనే పేరును మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా కొలీజియం సిఫార్సు చేసింది. అంతకుముందు జస్టిస్ బహారుల్ ఇస్లాం (1980), జస్టిస్ ఫాతిమా బీబీ (1989)లు సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. వీరిద్దరు హైకోర్టు జడ్జిలుగా రిటైరయ్యారు. ఇంటెలిజెన్స్ బ్యూరో నివేదిక ప్రకారం వర్షనేకు వ్యతిరేకంగా ఏమీ లేదని, వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఆయనకు మంచి పేరు ఉన్నదని, ఇవాల్యూయేషన్ కమిటీ కూడా ఆమోదించిందని కొలీజియం తెలిపింది. ఆయన పేరును కొలీజియం సిఫార్సు చేసే రోజున వర్షనే వయస్సు 59 ఏళ్లు అని, రిటైర్మెంట్ వయస్సు రావడంతో ఆయన తర్వాత పదవీ విరమణ చేశారని తెలిపింది. ఖాళీ ఏర్పడినప్పుడు కొలీజియం ఆయన పేరును పరిగణించినప్పుడు వర్షనే వయస్సు 58 ఏళ్లని చెప్పింది. వర్షనేతో పాటు అనురాధ శుక్లా, సంజీవ్ సుధాకర్ కల్గాంకర్, ప్రేమ్ నారాయణ్ సింగ్, ఆచల్ కుమార్ పలివల్, హ్రిదేశ్, అవినింద్రా కుమార్ సింగ్‌లనూ మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా కొలీజియం సిఫార్సు చేసింది.

ఈడీ చెప్పేవన్నీ అబద్ధాలే

తప్పుడు సాక్ష్యాలతో కేసును తప్పుదోవ పట్టిస్తోంది: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: తప్పుడు సాక్ష్యాలతో మద్యం కేసులో కోర్టును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తప్పుదోవ పట్టిస్తోందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఆయన శుక్రవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఢిల్లీ అసెంబ్లీ వద్ద విలేకరులతో మాట్లాడారు. 'ప్రజలను వేధించి, ఒత్తిడికి గురిచేసి తప్పుడు సాక్ష్యాలు సేకరించి సంజయ్ సింగ్ కేసూలో వలే మద్యం కేసులోనూ కోర్టును ఈడీ తప్పుదోవ పట్టిస్తోంది. సంజయ్ సింగ్‌లో చార్జిషీటులో ఒక రకంగా ఉంటే ఈడీ స్టేట్‌మెంట్ మరో రకంగా ఉంది. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా తన మొబైల్ ఫోన్లు ధ్వంసం చేసినట్లు ఈడీ ఆరోపించింది. వాస్తవానికి వాటిలో చాలా ఫోన్లు ఈడీ వద్దనే ఉన్నాయి అని ఈ వ్యవహారంలో విలేకరుల ప్రశ్నలకు కేజ్రీవాల్ బదులిచ్చారు. సిసోడియా ఫోన్లు ధ్వంసం చేసినట్లు ఈడీ చెబుతోంది కానీ చాలా వరకు ఫోన్లు దర్యాప్తు సంస్థ వద్ద ఉన్నాయి. ప్రజలను వేధించి, ఒత్తిడికి గురిచేసి సేకరించే తప్పుడు సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టి మద్యం కేసును ఈడీ తప్పుదోవ పట్టిస్తోంది. ఈ వ్యవహారంలో అసలు ఏమీ లేదు. ఇదంతా కల్పితం.. తప్పుడు సాక్ష్యాలాధారితం. ఇలా చేయడం మంచిది కాదు' అని అన్నారు. విద్యకు అత్యధిక ప్రాధాన్యతిస్తూ అంబేద్కర్ అడుగుజాడల్లో తమ ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. పేద-ధనిక తేడా లేకుండా ప్రతి బిడ్డకు విద్యను అందించడమే మా లక్ష్యమని కేజ్రీవాల్ అన్నారు. ఆప్ సీనియర్ నేత సంజయ్ సింగ్ కూడా సిసోడియా వ్యవహారంలో కోర్టుకు ఈడీ అబద్ధం చెబుతోందని ఆరోపించారు. సిసోడియా తన ఫోన్లను ధ్వంసం చేయలేదని, 14కుగాను ఐదు ఫోన్లు ఈడీ, సీబీఐ కస్టడీలో ఉన్నాయని చెప్పారు. ఆ ఫోన్ల ఐఎంఈఐ నంబర్లు వెల్లడించారు. అవన్నీ పనిచేస్తున్నట్లు ఈడీ నివేదిక చెబుతోందన్నారు. 14 ఫోన్లను సిసోడియా నాశనం చేసినట్లు ఆరోపిస్తున్న బీజేపీ నేతలు, ఢిల్లీ ఉత్తమ విద్యామంత్రిని అప్రతిష్ఠపాల్జేసిన ఈడీ అధికారులు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సింగ్ డిమాండ్ చేశారు.

హనుమాన్ జయంతి ప్రదర్శన

సంబల్‌పూర్‌లో భారీ భద్రత

సంబల్‌పూర్/భువనేశ్వర్ : హింసాకాండకు గురైన సంబల్‌పూర్‌లో అశాంతి నెలకొని ఉంది. ఒడిశా ప్రభుత్వం శుక్రవారం రోజు తర్వాత హనుమాన్ జయంతి ఊరేగింపుకు ముందు సుమారు 1500 మంది భద్రతా సిబ్బందిని మోహరించింది. గురువారం నుంచి హనుమాన్ జయంతి సమన్వయ కమిటీ అధ్వర్యంలో 36 గంటలపాటు బంద్ కారణంగా నగరం నిర్మానుష్యంగా మారింది. సంబల్‌పూర్ జిల్లా కలెక్టర్ అనన్య దాస్ మాట్లాడుతూ అల్లరి మూకల కదలికలను పర్యవేక్షించడానికి నగరం మొత్తం సీసీటీవీ నిఘాలో ఉందని, ఈ ప్రాంతంలో హింస వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి గురువారం నుంచి ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సంబల్‌పూర్ నగరంలో ఐపీసీ సెక్షన్ 144 కింద నిషేధాజ్ఞలు కూడా అమలులో ఉన్నాయి. ప్రజలలో విశ్వాసం కలిగించడానికి గురువారం నగర వీధుల్లో అక్కడ భద్రతా దళాలచే కవాతు జరిగింది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు జరగనున్న ప్రధాన ఊరేగింపులో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పరిపాలన దాదాపు 40 ప్లాటూన్‌లను (ఒక ప్లాటూన్‌లో 30 మంది సిబ్బంది) సాయుధ పోలీసులను మోహరించినట్లు ఆమె తెలిపారు. హనుమాన్ జయంతి వేడుకలను శాంతియుతంగా నిర్వహించేందుకు తగిన భద్రతా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. రెండు వర్గాల మధ్య బుధవారం ఘర్షణ జరిగినప్పటికీ ఊరేగింపును అనుమతించినట్లు దాస్ చెప్పారు. ఎందుకంటే హింసకు పాల్పడబోమని ఆ వర్గాల ప్రధాన సభ్యులు ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మొత్తం 35 బృందాలు ఈ ఊరేగింపులో పాల్గొంటాయి. ఇది సాయంత్రం బ్రూక్స్‌పాల్ హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమై సున్నిత ప్రాంతాల గుండా వెళుతుంది. ఈ సంవత్సరం ఏప్రిల్ 14 (శుక్రవారం) న వచ్చే మహా బిసుబా సంక్రాంతి ఒడిశా హనుమాన్ జయంతిని జరుపుకుంటుంది. పశ్చిమ ఒడిశా నగరంలో హనుమాన్ జయంతి సందర్భంగా బుధవారం బైక్ ర్యాలీ సందర్భంగా రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా అనేక వాహనాలు ధ్వంసమయ్యాయి. కొన్ని దుకాణాలకు నిప్పు పెట్టారు. రాళ్ల దాడిలో మొత్తం పది మంది పోలీసులు, హనుమాన్ జయంతి సమన్వయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ దామోదర్ కర్ సహా 12 మంది గాయపడ్డారు. అనంతరం సంబల్‌పూర్‌లో అల్లర్లకు పాల్పడిన ఆరోపణలపై 26 మందిని అరెస్టు చేసి జైలుకు పంపారు. నగరంలో కొందరిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అంతేకాకుండా, సామాజిక మాధ్యమ వేదికలపై నిఘా ఉంచాలని, విద్వేషపూరిత సందేశాలను ప్రసారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లను కోరారు. కోరాపుట్ జిల్లా యంత్రాంగం జైపూర్ పట్టణంలో ఏప్రిల్ 24 వరకు మధ్యాహ్నం 3 నుంచి ఉదయం 9 గంటల వరకు ర్యాలీలు, ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించకుండా నిషేధాజ్ఞలు విధించింది. ఈ తీర ప్రాంత పర్యటనలో ఉన్న కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ శుక్రవారం భువనేశ్వర్ విమానాశ్రయంలో మాట్లాడుతూ ఒడిశా శాంతికాముక రాష్ట్రమని, హనుమాన్ జయంతి ఊరేగింపుపై రాళ్లు రువ్వడం ఒడిశాకు గానీ, దేశానికి గానీ ఆమోదయోగ్యం కాదని అన్నారు.

రాజస్తాన్‌లో కాంగ్రెస్ ట్రబుల్‌షూటర్‌గా కమల్‌నాథ్

పైలెట్‌ను కలిసిన సీనియర్లు

న్యూఢిల్లీ: రాజస్తాన్, కాంగ్రెస్ పార్టీలో ఇద్దరు కీలక నేతలు గెహ్లాత్, పైలెట్ మధ్య వివాదం చిలికిచిలికి గాలివానగా మారుతోంది. వసుంధర రాజే హయాంలో జరిగిన అవినీతిపై చర్యలకు డిమాండ్ చేస్తూ సచిన్ పైలెట్ జైపూర్‌లో 24 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. దీంతో పరిస్థితి మరింత జఠిలమైంది. ఆయన దీక్షను పార్టీ వ్యతిరేక కార్యక్రమంగా కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో రాజీ కుదిర్చేందుకు ట్రబుల్ షూటర్‌గా కమల్‌నాథ్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దించింది. దీంతో కమల్‌నాథ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో పాటు పైలెట్‌ను కలిశారు. గత బీజేపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై చర్యలను కోరుతూ దీక్ష చేశానేగానీ అది పార్టీకి వ్యతిరేకం కాబోదని పైలెట్ సంజాయిషీ ఇచ్చుకున్నారు. ఈ సమావేశం క్రమంలో పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కాంగ్రెస్ వర్గాల సమాచారం. కాంగ్రెస్ రాజస్తాన్ ఇంచార్జి సుఖ్విందర్ సింగ్ రంధావా పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రెండు రోజుల్లో రెండు సార్లు కలిసి రాజస్తాన్ పరిస్థితిని వివరించారు. రాహుల్ గాంధీతోనూ ఆయన నివాసంలో భేటీ అయ్యారు. రాజస్తాన్ పరిణామాలపై ఆయనతోనూ సింగ్ చర్చించారు. అదానీ వ్యవహారంతో పాటు కర్నాటక ఎన్నికల్లో అవినీతిపై కాంగ్రెస్ ప్రశ్నలు లేవనెత్తుతున్న క్రమంలో సొంత పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రంలో చర్యలను కోరడంలో తప్పులేదని పైలెట్ అనుకూల వర్గం సమర్థించింది. 'క్రమశిక్షణ' చర్యలకు అవకాశమున్న క్రమంలో పైలెట్ స్పందిస్తూ గతేడాది సీఎల్పీ సమావేశాన్ని బహిష్కరించిన గెహ్లాత్ క్యాంపుపై చర్యలు ఎందుకు తీసుకోలేదు... దీక్ష జరగకముందే దానిని పార్టీకి వ్యతిరేక కార్యక్రమంగా ఎలా నిర్ధారిస్తారు అని ప్రశ్నించారు. మరోవైపు ఈ వివాదానికి తెరదించే పనిలో అధిష్ఠానం ఉన్నది. అందుకోసం ట్రబుల్‌షూటర్‌గా కమల్‌నాథ్‌ను రంగంలోకి దించి రాజీ కుదిరేందుకు మధ్యవర్తిత్వానికి యత్నిస్తోంది. సచిన్ పైలెట్ బుధవారం ఢిల్లీ వెళ్లిన విషయం విదితమే.

బీజేపీ వారసత్వ రాజకీయాలు: కాంగ్రెస్

బెంగళూరు : వారసత్వ రాజకీయాల గురించి పదేపదే విమర్శలు గుప్పించే బీజేపీ కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ నేతల కుటుంబ సభ్యులకు పెద్దసంఖ్యలో టికెట్లు కేటాయించడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా తప్పుపట్టింది. బీజేపీ నేతల కుటుంబ సభ్యులు 20 మందిని ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో దింపిందని పేర్కొంది. వారసత్వ రాజకీయాలకు బీజేపీ పెద్దపీట వేస్తూ ఇతర పార్టీలను వారసత్వ పార్టీలని ఆరోపిస్తోందని ఎద్దేవా చేసింది. అసెంబ్లీ సీట్ల కోసం బీజేపీ నేతలు సిగపట్లకు దిగారని, సీనియర్ నేతలను ఆ పార్టీ అవమానించిందని కాంగ్రెస్ ఎంపీ రణ్‌దీప్ సుర్జేవాలా తెలిపారు. దీనితో విసుగుచెందిన అనేక మంది నేతలు బీజేపీకి రాజీనామా చేశారని, కర్నాటకలో 40 శాతం అవినీతి ప్రభుత్వానికి వ్యతిరేకంగా 40 మంది తిరుగుబాటు అభ్యర్థులు పోటీలో నిలిచారని తెలిపారు.

శాంతి... సోదరభావంతో పంజాబ్ ప్రజలు

బైసాఖి సందేశంలో అకల్ తక్త్ జతేదార్

భటిండా : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు శాంతి, సౌభ్రాతృత్వంతో జీవిస్తున్నారని అకల్ తఖ్త్ జతేదార్ శుక్రవారం గియానీ హర్‌ప్రీత్ సింగ్ శుక్రవారం తెలిపారు. అదే సమయంలో పంజాబ్ వ్యతిరేక శక్తుల దుష్ట చర్యలను చెదిరిన రాష్ట్రంగా చిత్రీకరిస్తున్నారని హెచ్చరించారు. ఇక్కడి తల్వండి సాబోలోని తఖ్త్ దమ్దామా సాహిబ్ నుంచి బైసాఖి సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కత్తిని మోసుకెళ్లడం సిక్కు సంప్రదాయంలో అంతర్భాగమని, అయితే దానిని నిషేధించాలని ఒక వర్గం లాబీయింగ్ చేస్తోందని అన్నారు. 'సిక్కులు మతపరమైన సంప్రదాయాన్ని అనుసరించడానికి కత్తులు ఉంచుకోవాలి' అని తెలిపారు. ఖాల్సా సజ్నా దివస్‌ను పురస్కరించుకుని పవిత్ర స్థలంలో అధిక భద్రతా తనిఖీలు ఉన్నప్పటికీ పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడం పట్ల జతేదార్ ఆనందం వ్యక్తం చేశారు. సమాజంలో మత్తు పదార్థాలపై పోరాడాలని, సిక్కు గురువుల సందేశాలను అనుసరించాలని సమాజానికి విజ్ఞప్తి చేశారు. ఉత్తర భారతదేశంలోని పంజాబ్ అతిపెద్ద పండుగలలో ఒకటైన బైసాఖీ, పదవ సిక్కు గురు గోవింద్ సింగ్ చేత 'ఖల్సా పంత్' (సిక్కు క్రమం) స్థాపన రోజును, అలాగే పంట సీజన్ ప్రారంభాన్ని కూడా సూచిస్తుంది. పండుగను పురస్కరించుకుని పంజాబ్‌లోని ప్రజలు శుక్రవారం గురుద్వారాల్లో ప్రార్థనలు చేశారు.

ఈశాన్య రాష్ట్రాలకు ఎయిమ్స్

ప్రారంభించిన ప్రధాని మోదీ

గువహటి: ఈశాన్య రాష్ట్రాలు, అసోంలో వైద్య, ఆరోగ్య సదుపాయాలు నూతన బలాన్ని సంతరించుకున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. ఇప్పుడు ఈశాన్య రాష్ట్రాలకు మొట్టమొదటి ఎయిమ్స్ వచ్చిందని, అసోంకు మూడు వైద్య కళాశాలలు వచ్చాయని వివరించారు. ఈశాన్య రాష్ట్రాలకు గత ప్రభుత్వాలు చాలా దూరంగా ఉండేవని, వాటిని దగ్గరకు చేర్చేందుకు బీజేపీ ప్రభుత్వం అంకితభావంతో కృషి చేస్తోందని నరేంద్ర మోదీ చెప్పారు. మోదీ శుక్రవారం అసోంలో బిహు ఉత్సవాల్లో పాల్గొనడంతోపాటు గువహటిలో అఖిల భారత వైద్య విజ్ఞాన శాస్త్రాల సంస్థ(ఎయిమ్స్)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రూ.14,300 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన లేదా ప్రారంభోత్సవాలు చేశారు. గువహటిలో జరిగిన బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ రొంగలి బిహు పండుగ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలకు గత ప్రభుత్వాలు చాలా దూరంగా ఉండేవని, వాటిని అభివృద్ధి చేసేందుకు బీజేపీ ప్రభుత్వం అంకితభావంతో కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. ఈశాన్య రాష్ట్రాల్లో తొమ్మిదేళ్ల నుంచి జరుగుతున్న అభివృద్ధి గురించి తాను మాట్లాడినప్పుడల్లా కొందరు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. అసోంలో అభివృద్ధి ఘనత తమకు రావడం లేదని వారు బాధపడుతున్నారన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో మొట్టమొదటి ఎయిమ్స్‌ను ఆయన జాతికి అంకితం చేశారు. దీనిని రూ.1,123 కోట్ల వ్యయంతో నిర్మించారు. అదేవిధంగా నల్బరి వైద్య కళాశాల, నాగావ్ వైద్య కళాశాల, కోక్రజర్ వైద్య కళాశాలను వర్చువల్ విధానంలో మోదీ ప్రారంభించారు. ఎయిమ్స్ ఆసుపత్రి అసోం ప్రజలకు మాత్రమే కాకుండా ఇతర ఈశాన్య రాష్ట్రాలకు కూడా వైద్య సేవలు అందిస్తుందన్నారు. మోదీ ప్రారంభించిన మూడు వైద్య కళాశాలల్లో 500 పడకలు ఉన్నాయి. వీటిలో 24 అండర్‌గ్రాడ్యుయేట్ డిపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ఈ కళాశాలలు సంవత్సరానికి 100 మంది ఎంబీబీఎస్ విద్యార్థులను చేర్చుకుంటాయి. దీంతో అసోంలో మొత్తం ఎంబీబీఎస్ విద్యార్థుల సంఖ్య 1,500కు పెరుగుతుంది.

35 సీట్లివ్వండి... మమత సర్కారును కూల్చేస్తాం

బెంగాల్‌లో అమిత్‌షా వ్యాఖ్యలు



సూరి(బెంగాల్): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్‌లో మొత్తం 42 ఎంపీ సీట్లకుగాను 35 చోట్ల బీజేపీని గెలిపించాలని రాష్ట్ర ప్రజలకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విజ్ఞప్తి చేశారు. ఈ లక్ష్యం సాధిస్తే 2025 వరకు తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం బతికిబట్ట కట్టడం కష్టమేనని చెప్పారు. మమతా బెనర్జీ ప్రభుత్వం హిట్లర్ తరహా పాలన సాగిస్తోందని అమిత్‌షా ఆరోపించారు. రాష్ట్రంలో 35కు పైగా లోక్‌సభ సీట్లు సాధించడం ద్వారా బీజేపీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో శ్రీరామనవమి ర్యాలీలపై దాడులు చేసే సత్తా ఏ ఒక్కరికీ ఉండదని రెచ్చగొట్టారు. రామనవమి ఉత్సవాల సందర్భంగా రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో హింస చెలరేగిన విషయాన్ని కేంద్రమంత్రి గుర్తుచేశారు. 'నేను మీకు ఒక్కటే స్పష్టం చేస్తున్నా. నరేంద్రమోదీ మరోసారి దేశ ప్రధాని అవుతారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్ నుంచి మాకు 35 సీట్లకు పైగా ఇస్తే 2025 వరకూ కూడా మమత ప్రభుత్వం మనజాలదని హామీ ఇస్తున్నా' అని బీర్భుమ్ జిల్లాలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో అమిత్‌షా చెప్పుకొచ్చారు. 2026 వరకు మమతా బెనర్జీ ప్రభుత్వ పదవీకాలం ఉంటుంది. 'తదుపరి ముఖ్యమంత్రిగా తన మేనల్లుడిని చేయాలని మమత కలలు కంటున్నారు. కానీ బెంగాల్‌కు తదుపరి ముఖ్యమంత్రి బీజేపీ అభ్యర్థే ఉంటారు. అవినీతి తృణమూల్ కాంగ్రెస్‌పై పోరాడటం, ఓడించే సత్తా బీజేపీకి మాత్రమే ఉందని అమిత్‌షా చెప్పారు.

క్షమాభిక్ష పిటిషన్లపై జాప్యం తగదు

రాష్ట్రాలు, అధికారులకు సుప్రీం కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : మరణశిక్ష ఖైదీలు క్షమాభిక్ష పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో విపరీతమైన జాప్యాన్ని మరణశిక్ష ఖైదీలు సద్వినియోగం చేసుకుంటున్నారని, అటువంటి అభ్యర్థనలను త్వరగా పరిష్కరించేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత అధికారులను సుప్రీం కోర్టు శుక్రవారం ఆదేశించింది. అత్యున్నత న్యాయస్థానం తుది తీర్పు వెలువరించిన తర్వాత కూడా క్షమాభిక్ష పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవడంలో విపరీతమైన జాప్యం జరుగుతోందని, మరణశిక్ష లక్ష్యం, ఉద్దేశం నిరాశ చెందుతుందని న్యాయమూర్తులు ఎం.ఆర్.షా, సిటీ రవికుమార్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. 'అందువల్ల, రాష్ట్ర ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులు క్షమాభిక్ష పిటిషన్‌లను త్వరగా పరిష్కరించేలా చూడడానికి అన్ని ప్రయత్నాలు చేయాలి. తద్వారా నిందితుడు కూడా అతని భవితవ్యాన్ని తెలుసుకోవచ్చు. న్యాయం కూడా జరుగుతుంది. బాధితులకు కూడా న్యాయం జరుగుతుంది' అని ధర్మాసనం పేర్కొంది. ఒక మహిళ, ఆమె సోదరికి విధించిన మరణశిక్షను తగ్గించిన బొంబాయి హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై పరిశీలనలు వచ్చాయి. దాదాపు ఏడేళ్ల 10 నెలల పాటు పెండింగ్‌లో ఉన్న నిందితులు కోరిన క్షమాభిక్ష పిటిషన్‌లపై నిర్ణయం తీసుకోకపోవడంలో రాష్ట్రం/రాష్ట్ర గవర్నర్ నుంచి విపరీతమై, వివరించలేని జాప్యం జరిగిందన్న కారణంతో హైకోర్టు మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది. కొల్హాపూర్‌లో 13 మంది పిల్లలను అపహరించి తొమ్మిది మందిని చంపినందుకు 2001లో స్థానిక కోర్టు వారికి మరణశిక్ష విధించింది. దీనినని 2004లో హైకోర్టు ధ్రువీకరించింది. 2006లో సుప్రీం కోర్టు కూడా హైకోర్టు తీర్పును సమర్థించింది. తర్వాత, వారి క్షమాభిక్ష పిటిషన్లను 2013లో గవర్నర్ తిరస్కరించారు. ఆ తర్వాత 2014లో రాష్ట్రపతి తిరస్కరించారు. హైకోర్టు ఆదేశాలతో జోక్యం చేసుకోవడానికి నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చేటప్పుడు నేరం తీవ్రతను పరిగణనలోకి తీసుకోవచ్చని పేర్కొంది. అయితే, మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చేటప్పుడు క్షమాభిక్ష పిటిషన్లను పరిష్కరించడంలో విపరీతమైన జాప్యం కూడా సంబంధితంగా పరిశీలన చేయవచ్చని తెలిపింది. 'పైన ఉన్న వాటిని దృష్టిలో ఉంచుకొని, ఉరిశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మారుస్తూ హైకోర్టు జారీ చేసిన శిక్షార్హమైన తీర్పు, ఉత్తర్వు జోక్యం చేసుకోవలసిన అవసరం లేదు' అని పేర్కొంది. 'మేము క్షమాభిక్ష పిటిషన్లు దాఖలు చేయాల్సిన లేదా మరణశిక్షకు వ్యతిరేకంగా క్షమాభిక్ష పిటిషన్లను నిర్ణయించాల్సిన అన్ని రాష్ట్రాలు/సముచిత అధికారులను గమనిస్తాము, నిర్దేశిస్తాము. అటువంటి క్షమాభిక్ష పిటిషన్లను త్వరగా నిర్ణయించడం వలన క్షమాభిక్ష పిటిషన్లపై నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేయడం వల్ల కలిగే ప్రయోజనం నిందితులకు చేరదు' అని ధర్మాసనం తెలిపింది.

కాంగ్రెస్ గూటికి లక్ష్మణ్

బీజేపీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా

బెంగళూరు: కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అసంతృప్త నేతలు వడివడిగా పార్టీలు మారే ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నారు. మే 10న జరిగే ఎన్నికలకు సంబంధించి టికెట్ నిరాకరించడంతో బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎంఎల్‌సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి లక్ష్మణ్ సవాడి శుక్రవారం ప్రకటించారు. అదే సమయంలో తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు. కర్నాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్, ప్రతిపక్ష నేత సిద్దరామయ్య, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి రణదీప్‌సింగ్ సూర్జేవాలాను కలిసి తర్వాత లక్ష్మణ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. 'లక్ష్మణ్‌తో మా సమావేశం సుహృద్భావ వాతావరణంలో జరిగింది. ఆయన గౌరవ మర్యాదల గురించి మాకు తెలుసు. కాంగ్రెస్ కుటుంబంలో సభ్యుడిగా ఉంటానని లక్ష్మణ్ తనకు తాను అంగీకరించారు. పార్టీ సిద్ధాంతం, నాయకత్వాన్ని అంగీకరించిన తర్వాతే లక్ష్మణ్ మా వద్దకు వస్తున్నారు' అని డీకే శివకుమార్ విలేకరులకు చెప్పారు. కాగా, బీజేపీ నుంచి విడిపోయి...కాంగ్రెస్‌లో చేరాలన్న సవాడి నిర్ణయం బాధాకరమని ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై అన్నారు. 'నేను చాలా బాధపడుతున్నాను. మాకు చాలా సన్నిహిత సంబంధం ఉంది. కొన్నిసార్లు ఇలాంటి రాజకీయ పరిస్థితులు ఉత్పన్నమవుతాయి' అని బొమ్మై అన్నారు. కాంగ్రెస్‌లోనే తన రాజకీయ భవిష్యత్ ఉందని సవాడి భావించి ఉండవచ్చన్నారు. పార్టీలో తమ పని తాము చేసుకుంటామని చెప్పారు. మరోవైపు, బీజేపీకి తాను విశ్వాసపాత్రుడిగా ఉన్నానని, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ పార్టీ అభ్యర్థుల విజయం కోసం తాను పాటుపడ్డానని, అయితే, తనకు టికెట్ ఇస్తానని బీజేపీ మోసం చేసిందని లక్ష్మణ్ విమర్శించారు. బెళగావి జిల్లాలోని అతనీ నియోజకవర్గం నుంచి ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కాంగ్రెస్‌లో చేరాలన్న తన నిర్ణయం గురించి లక్ష్మణ్ చెబుతూ ఎన్నికల్లో పోటీ చేయడానికి టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశానని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తన నియోజకవర్గంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కొన్ని నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేయాలని అడిగానని తెలిపారు. లక్ష్మణ్ అభ్యర్థనను తోసిపుచ్చుతూ అతనీ నియోజకవర్గం టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే మహేశ్ కుమతల్లికి బీజేపీ కట్టబెట్టింది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కుమతల్లి చేతిలో లక్ష్మణ్ ఓటమి చెందారు. కుమతల్లితో పాటు కొంతమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించి...కాంగ్రెస్-జేడీఎస్ ప్రభుత్వం పతనానికి కారణమయ్యారు. అప్పుడు కుమతల్లి బీజేపీలో చేరారు. ఉప ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై కుమతల్లి విజయం సాధించారు. ఉపముఖ్యమంత్రి కావాలని పాలక పార్టీని తాను డిమాండ్ చేయలేదని, అయినా తనకు సమాచారం లేకుండానే ఆ పదవి నుంచి తప్పించారని లక్ష్మణ్ విమర్శించారు. 2018 ఎన్నికల్లో ఓటమి తర్వాత తాను ఎమ్మెల్సీ పదవిచ్చి...ఉపముఖ్యమంత్రిని చేశారని తెలిపారు. ఆ తర్వాత ఆ పదవి నుంచి తప్పించారన్నారు. తనను ఎందుకు మంత్రిని చేశారు...ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో తనకు టికెట్ ఇవ్వకపోవడానికిగల కారణం వెల్లడించాలని బీజేపీని డిమాండ్ చేశారు.

అన్నదమ్ముల సవాల్

శివమొగ్గ: కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో సొరబ నియోజకవర్గం నుంచి సొంత అన్నదమ్ములు పోటీ చేస్తున్నారు. ఒకరు కాంగ్రెస్ తరపున అయితే మరొకరు బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తున్నారు. వారిద్దరు ఎవరో కాదు...కర్నాటకకు సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన ఎస్.బంగారప్ప తనయులు. తండ్రి రాజకీయ వారసత్వం కోసం అన్నదమ్ములు మరోసారి కత్తులు దూస్తున్నారు. శివమొగ్గ జిల్లాలోని సొరబ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కుమార్ బంగారప్ప, మధు బంగారప్ప ప్రత్యర్థులుగా పోటీ చేస్తున్నారు. ఈ నియోజకవర్గానికి ఎస్.బంగారప్ప 1967 నుంచి 1994 వరకు ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత బంగారప్ప లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారు. కుమార్ బంగారప్ప బీజేపీ టికెట్‌పై మరోసారి గెలవాలని పట్టుదలగా ఉండగా...ఆయన సోదరుడు మధు కాంగ్రెస్ టికెట్‌పై విజయం సాధించాలని ఆరాటపడుతున్నారు. 2018 ఎన్నికల్లో మధుపై కుమార్ 3,286 ఓట్లు తేడాతో విజయం సాధించారు. 2018 ఎన్నికలకు ముందు కుమార్ కాంగ్రెస్‌ను వదిలి బీజేపీలో చేరారు. అప్పుడు మధు జేడీఎస్ తరపున సొరబ సిట్టింగ్ ఎమ్మెల్యే. 2021లో మధు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఈ సోదరులిద్దరూ రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే కాదు...కుటుంబాల మధ్య వైరుధ్యాలు తీవ్రంగానే ఉన్నాయి. పరస్పర విమర్శలు సైతం తారస్థాయిలోనే ఉంటాయి. 2004 నుంచి అంటే బంగారప్ప బతికున్నప్పుడు కూడా అన్నదమ్ములిద్దరూ రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్నాయి. కుమార్ 1996(ఉప ఎన్నిక), 1999, 2004, 2018లో సొరబ నుంచి ఎన్నికయ్యారు. మధు 2013లో మాత్రమే విజయం సాధించారు. సోదరులిద్దరికీ గతంలో కన్నడ చిత్రపరిశ్రమతో సంబంధాలు ఉన్నాయి. కుమార్ నటుడిగా పనిచేయగా మధు నటుడు, నిర్మాతగా వ్యవహరించారు.

పాలించే నైతిక హక్కు మోదీకిలేదు

కార్పొరేట్లకు దేశ సంపద ధారాదత్తం

హైదరాబాద్ సభలో నారాయణ, అజీజ్‌పాషా

విశాలాంధ్ర-హైదరాబాద్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేదల నుంచి పన్నులు వసూలు చేస్తూ అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు రాయితీలు కల్పిస్తూ, దేశ సంపదను దోచిపెడుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా విమర్శించారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు రాష్ట్రాలలో మతవిద్వేషాలను రెచ్చగొడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుతాన్ని ఇంటికి పంపించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను,కార్పొరేట్ అనుకూల విధాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి, వారిలో చైతన్యం కల్పించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు చేపట్టిన "ఇంటింటికీ సీపీఐ" ప్రచారయాత్ర హైదరాబాద్‌లో శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇందిరాపార్క్ వద్ద ఏర్పాటు చేసిన ప్రారంభ బహిరంగ సభనుద్దేశించి కె.నారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేపట్టాలన్నారు. 'దళితుల చేతికి డబ్బులు ఇవ్వడం లేదని, ఓటు హక్కు అనే ఆయుధాన్ని ఇస్తున్నానని, దీనిని తలదించుకునేలా చేస్తారో, తలఎత్తుకునేలా వేస్తారా? మీ ఇష్టం, నిజాయితీగా ఓటు వేస్తే తల ఎత్తుకునేలా ఉంటారు. ఓటు అమ్ముకుంటే తల దించుకుని తిరుగుతారు' అన్న అంబేద్కర్ మాటలను నారాయణ గుర్తు చేశారు. ప్రజల్లో ఇంకా ఆ చైతన్యం రాలేదని, వస్తే మోదీలాంటి ప్రమాదకారి అధికారంలో వస్తారా?, నిత్యం దళితులపై ఊచకోత కోసే ముఖ్యమంత్రులు అధికారంలోనికి వస్తారా? అని అన్నారు. పేదలు తమ ఓట్లు హకును సద్వినియోగం చేసుకుని తల ఎత్తుకుని తిరగాలన్నారు. కమ్యూనిస్టులు లేకపోతే పేదలకు ప్రభుత్వ భూములు దక్కకపోగా, ఆ భూములు భూస్వాముల, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆధీనంలో ఉండేవని అన్నారు. భూ సమస్యలపైన మరింత పోరాటం చేయాలని, ఒక కాలు భూమి మీద,మరో కాలు జైలులో ఉండేలా పోరాటం చేస్తేనే భూ సమస్య పరిష్కారం అవుతుందని స్పష్టం చేశారు. మోదీకి 30 మంది దత్త పుత్రులు ఉన్నారని, అందులో 29 మంది విదేశాలకు పారిపోగా మరో దత్త పుత్రుడు అదానీ ఇక్కడే ఉన్నారని, ఆయనకు దేశ సంపదను కట్టబెడు తున్నారని విమర్శించారు. అదానీకి ఇచ్చిన రాయితీల్లో పది శాతం ఖర్చు చేసినా పేద ప్రజానీకానికి ఇళ్లను నిర్మించవచ్చని, ప్రాజెక్ట్ నిర్మించవచ్చని తెలిపారు. ఏ మూలకు పోయినా కార్యకర్తలు ఉన్న సీపీఐకి జాతీయ పార్టీ గుర్తింపు తీసేస్తారా?అని ప్రశ్నించారు. ప్రజలే సీపీఐకి గుర్తింపునిస్తారని, బీజేపీ కుట్రను ప్రజాక్షేత్రంలో తేల్చు కుంటామని నారాయణ హెచ్చరించారు. సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలను పట్టించుకోవడం లేదన్నారు.ఎన్నికల ముందు మోదీ ఇచ్చిన హామీలను అధికారంలోనికి వచ్చిన తర్వాత చెత్తకుప్పలో పడేశారని, పేదలను, మహిళలు, నిరుద్యోగులను విస్మరించారని విమర్శించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజల గుండెల్లో కమ్యూనిస్టు పార్టీ పట్ల ఉన్న స్థానాన్ని ఏ ఎన్నికల కమిషన్ చెరపలేదని రుజువు చేయాలని పిలుపునిచ్చారు. దోపిడీదారుల గుండెలు అదిరే పద్ధతుల్లో సీపీఐ సింహగర్జన చేస్తుందని, నడుస్తూనే ఉంటుందన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ సీపీఐ చేపట్టే పోరాటాలు, న్యాయ సమత్మమైనవని, చట్టబద్ధమన్నారు. పాలక వర్గాలు పని చేయకపోతే పోరాడి సాధించుకోవాలని, అదే అంబేద్కర్ సందేశమని, ఆ దిశగా ప్రజలలో చైతన్యం కల్పించాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చెరుపలి సీతారాములు మాట్లాడుతూ ప్రజా సమస్యలపైన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపైన పోరాటాన్ని కొనసాగి స్తామన్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయని, ధరలకు ప్రధాన కారణమే మోదీ ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం ప్రమాదకరమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ చేపట్టిన ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో సీపీఎం శ్రేణులు కూడా పాల్గొంటారని తెలిపారు.

అపార జ్ఞానశీలి అంబేద్కర్

గవర్నర్, సీఎం జగన్ నివాళి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దేశం గర్వించదగ్గ మేధావుల్లో అగ్రగణ్యుడు, మహోన్నతుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కొనియాడారు. ఆయన చిత్రపటానికి రాజ్‌భవన్‌లో గవర్నర్, సీఎం క్యాంపు కార్యాలయంలో జగన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, న్యాయ, సామాజిక, రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మిక తదితర రంగాల్లో అపార జ్ఞానశీలి. దేశ రాజకీయ, ప్రజాస్వామ్య సాంఘిక వ్యవస్థలకు దిక్సూచి. వాటికి గట్టి పునాదులు వేసిన రాజ్యాంగ నిర్మాత" అని సీఎం జగన్ ట్వీట్ చేశారు.

దేశానికే ఏపీ తలమానికం

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున

బీఆర్ అంబేద్కర్ జయంతి రాష్ట్ర స్థాయి వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలోనే సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం తలమానికంగా నిలుస్తోందని, కులం, మతం, ప్రాంతం, పార్టీలని చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర స్థాయి జయంతిని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం వేడుకగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేదికపై ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రణాళికా సంఘ వైస్ చైర్మన్ మల్లాది విష్ణువర్ధన్ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. మేరుగు నాగార్జున మాట్లాడుతూ అంబేద్కర్ నాటి సమాజంలో నెలకొన్న అస్పృశ్యతపై పోరాడిన దీరోధాత్తుడని, ఆయన ఆశయ సాధన నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. దేశంలోని ప్రజాస్వామ్యం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందంటే దానికి కారణం అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే కారణమన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని, అయితే నేడు ఆయన తనయుడు జగన్ అవే అడుగుజాడల్లో నడుస్తూ రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తుండటం గొప్ప విషయమన్నారు. ఇప్పటివరకు రూ.2.98 లక్షల కోట్లు పేదలకు సంక్షేమ పథకాలు అందచేసిన ఏకైక ప్రభుత్వం జగన్ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. వసతి దీవెన, విద్యా దీవెన పథకాల్లో దాదాపు 10 లక్షలకు పైగా దళిత విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ సంఘ సంస్కర్త, గొప్ప మానవతావాది అంబేద్కర్ అని కొనియాడారు. అంబేద్కర్ నాడు సమాజంలో నెలకొన్న సామాజిక అసమానతలను రూపుమపటానికి విద్య అనే ఆయుధాన్ని ఎక్కు పెట్టాడని గుర్తుచేశారు. మల్లాది విష్ణువర్ధన్ మాట్లాడుతూ బీఆర్ అంబేద్కర్ దేశానికే తలమానికంగా నిలిచి అందరి మనస్సుల్లో సుస్థిర స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు.

అంబేద్కర్‌కు వినయ్ విశ్వం, కారత్ నివాళి

సీపీఐ, సీపీఎం భారీ ప్రదర్శన

ఎంబీవీకేలో అలరించిన నృత్య ప్రదర్శనలు

బీజేపీ కనుసన్నల్లో జగన్ పాలన : రామకృష్ణ, శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం దగ్గర ఆయన విగ్రహానికి సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు, ఎంపీ వినయ్ విశ్వం, సీపీఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్ కారత్, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, శ్రీనివాసరావు, సీపీఐ, సీపీఎం నేతలు, ప్రజా సంఘాల నేతలు నివాళులర్పించారు. 'ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీ-మోదీని సాగనంపుదాం, దేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో సీపీఐ-సీపీఎం ఉమ్మడిగా బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రచారభేరి తలపెట్టారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి ఉభయ పార్టీల నేతలు పూలమాలలేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం తుమ్మలపల్లి నుంచి ఏలూరు రోడ్డు మీదుగా ఎంబీ విజ్ఞాన కేంద్రం వరకు భారీ ర్యాలీగా నేతలు తరలివచ్చారు. ప్రచారభేరి ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజానాట్యమండలి కళాకారులు పి.చంద్రానాయక్, సిహెచ్.పెంచలయ్య, ఆర్.పిచ్చయ్య, కేవీ భాస్కరరావు, బాషా, అనిల్, అనీఫ్, అప్పన్న తదితరులు అభ్యుదయ గీతాలను ఆలపించారు. అంబేద్కర్ ఆలోచనలపై విద్యార్థి నులు చేసిన నృత్యగీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉభయ కమ్యూనిస్టుల అధ్వర్యంలో ప్రచారభేరి నిర్వహించడం అభినందనీయ మన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలంటే దేశంలోని కమ్యూనిస్టులతోపాటు ప్రతిపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఐక్యం కావాలని కోరారు. ఏ రాష్ట్రానికి చేయనంతగా ఏపీకి మోదీ ద్రోహం చేశారన్నారు. నాడు ప్రత్యేక హోదా పదేళ్లు ఇస్తామని చెప్పిన బీజేపీ నేతలు సైతం... ఇవాళ దానిపై ముగిసిన అధ్యాయంగా మాట్లాడటాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. విభజన హామీలు అమలు నుంచి పోలవరం, కడప స్టీలు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వే జోన్, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధుల ప్రస్తావనే లేదన్నారు. పోరాటాల త్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కును కేంద్రం ప్రైవేట్ పరం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వానికి జగన్ వంత పలుకుతున్నారని, బీజేపీ కనుసన్నల్లో ఆయన పాలన కొనసాగుతోందని ధ్వజమెత్తారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ బిడ్‌లో తెలంగాణ ప్రభుత్వం బిడ్ వేస్తే జగన్‌కు రాజకీయ ఆత్మహత్యేనంటూ ఎద్దేవా చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక వైపున బీఆర్ అంబేద్కర్‌కు భారీ ఎత్తున విగ్రహాలు కట్టి, పెద్దఎత్తున ప్రభుత్వాలు ఉత్సవాలను నిర్వ హిస్తూ, మరోవైపు దళిత, ఆదివాసీ, బీసీలకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులను విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. మోదీ అధికారంలోకి వచ్చాక కేంద్ర బడ్జెట్‌లో ఉండే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ తొలగించారని, రిజర్వేషన్లు సరిగ్గా అమలు చేయడం లేదని, మనువాదం ధర్మశాస్త్రం పేరుతో దళితులపై దాడులు పెరిగిపోతున్నా యన్నారు. గిరిజన ప్రాంతాల్లో అటవీ సంరక్షణ చట్టాలకు సవరణ చట్టాలు తెచ్చి, అక్కడి భూములను పెత్తందారులకు కట్టబెట్టేందుకు ప్రయత్ని స్తున్నారని ధ్వజమెత్తారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై కేంద్రం ద్రోహం చేస్తుంటే సీఎం జగన్ మౌనంగా ఉండటం తగదన్నారు. సభకు అధ్యక్షత వర్గంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు వ్యవహరించారు. దోనేపూడి శంకర్ మాట్లాడుతూ దేశాన్ని కార్పొరేట్ రంగానికి తనఖా పెట్టే పరిస్థితులను మోదీ ప్రభుత్వం కల్పించిందని, ఆచార వ్యవహారాల నుంచి ఆహారం వరకు ఆంక్షలు విధిస్తోం దన్నారు. సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేసేది ఒక్క వామపక్షాలేనని నొక్కి చెప్పారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మన వంట గదిలోను, ఇంటిలోను, తుదకు మెదడులోకి విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రదర్శనలో సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావుతో పాటు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్సన్‌బాబు, కె.శివారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్నీడు యలమందరావు, సీపీఐ నగర నాయకులు నక్కా వీరభద్రరావు, లంకా దుర్గారావు, మహిళా సమాఖ్య నాయకులు కె.రాణి, పంచదార్ల దుర్గాంబ, ఓర్సు భారతి, సీపీఎం నగర నాయకులు దోనేపూడి కాశీనాథ్, సీపీఐ, సీపీఎం రాష్ట్ర, విజయవాడ నగర ప్రజా సంఘాల నేతలు పెద్దఎత్తున హాజరయ్యారు.

పంటలకు గిట్టుబాటు ధరల్లేక

తీవ్రనష్టంలో రైతులు

నేపాల్ రైతు సంఘాల సమ్మేళనంలో ఏఐకేఎస్ అధ్యక్షులు రావుల వెంకయ్య

విశాలాంధ్ర-న్యూఢిల్లీ: పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య తెలిపారు. పశ్చిమాసియా ప్రాంతీయ రైతు సంఘాల సమ్మేళనం 2023 ఏప్రిల్ 12-14 తేదీలలో నేపాల్‌లోని జల్‌జిలే, జాఫా జిల్లాల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి పశ్చిమాసియాకు సంబంధించిన 5 దేశాలకు చెందిన 70 మందికి పైగా రైతు నాయకులు హాజరయ్యారు. వారిలో భారతదేశం నుంచి అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, కార్యదర్శి పశ్య పద్మ, కార్యవర్గ సభ్యులు కుల్వంత్‌సింగ్, అజిత్ కుమార్ ముఖర్జీ, ఫార్వర్డ్ బ్లాక్ నుంచి గోవిందరాయ్, సుందరరామరాజులు, పాకిస్తాన్ నుంచి తారీఖ్ మహ్మద్, బంగ్లాదేశ్ నుంచి నిమయ్ గంగూలీ, శ్రీలంక నుంచి సుభాషిణీ దీప, నేపాల్ నుంచి డాక్టర్ ప్రేమదంగల్, సరితా భూస్వాల్ తదితరులు పాల్గొన్నారు. ప్రారంభ సమావేశానికి అధ్యక్షులుగా డా॥ ప్రేమ్‌దంగల్ వ్యవహరించారు. ఈ సభలో ఆయా దేశాల రైతు నాయకులు ఉపన్యసించారు. ముఖ్య అతిథిగా నేపాల్ మాజీ ప్రధాన మంత్రి, కమ్యూనిస్టు నాయకులు కె.పి.ఓలీ శర్మ ప్రసంగించారు. వారితోపాటు ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతూ ఈ సమ్మేళనానికి పశ్చిమాసియాకు సంబంధించిన 5 దేశాల రైతు ప్రతినిధులు హాజరుకావడం సంతోషమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు కూడా ఒకే విధంగా ఉంటున్నాయన్నారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రానందున, తెగుళ్లు, అకాల వర్షాలు, అనావృష్టి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారన్నారు. తెచ్చిన అప్పులు తీర్చలేక ఆత్మాభిమా నంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా రన్నారు. భారతదేశంలో అఖిల భారత కిసాన్ సభ స్వాతంత్ర్య ఉద్యమంలో ఏర్పడిన తొలి రైతు సంఘమన్నారు. 1936లో పుట్టి నేటికి 88 సంవత్సరాలు దాటాయని, నాటి నుంచి నేటి వరకు అనేక రైతాంగ పోరాటాలు నిర్వహించి రైతాంగానికి అండగా నిలబడిందన్నారు. ఇటీవల నరేంద్ర మోదీ భారత దేశ రైతాంగానికి వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలు తెచ్చి వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగించారన్నారు. వాటిని ఉపసంహరించు కోవాలని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంవత్స రానికి పైగా చారిత్రాత్మక రైతాంగ పోరాటం నిర్వహించారన్నారు. ఆ పోరాటంలో 750 మంది రైతులు అమరులయ్యారని తెలిపారు. 540 రైతు సంఘాలు ఏకతాటిపైకి వచ్చి ఐక్య పోరాటం నిర్వహించిన ఫలితంగా చివరకు మోదీ దిగివచ్చి ఆ నల్ల చట్టాలను ఉపసంహ రించుకొని యావత్ దేశ రైతాంగానికి క్షమాపణలు చెప్పారన్నారు. అలాంటి పోరాట స్ఫూర్తితో పశ్చిమాసియా దేశాల రైతులు కూడా నడవా లన్నారు. 13వ తేదీన నేపాల్ దేశ జాతీయ రైతు సంఘం మహాసభ ప్రారంభం సందర్భంగా 30 వేల మందికి పైగా రైతులతో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో నేపాల్ మాజీ ప్రధాని, ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు కె.పి.ఓలీ శర్మ ప్రధానో పన్యాసం చేస్తూ నేపాల్ దేశ రైతుల శ్రేయస్సు కోసం గతంలో పని చేశామని, భవిష్యత్తులో కూడా వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సభలో వివిధ పశ్చిమాసియా దేశాల ప్రతినిధులు కూడా పాల్గొని తమ సంఘాల తరపున సంఘీభావం తెలిపారు. నేపాల్ కళాకారులు తమ పాటలు, నృత్యాలతో ప్రజలను ఉత్తేజపరిచారు. 14వ తేదీన ఆ దేశ రైతు ప్రతినిధుల సమావేశం కొనసాగింది.

గ్రామీణ కష్టజీవులకు సంక్షేమం అందాలి

- జాతీయ సంపదలో వాటా కోసం పోరాడదాం
- ఆగస్టు చివరి వారంలో బాపట్లలో సంఘం రాష్ట్ర మహాసభ
- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం శ్రేణులకు జల్లి విల్సన్, ఆవుల శేఖర్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న కష్టజీవులకు సంక్షేమంతో పాటు అభివృద్ధి, ఆత్మగౌరవం, జాతీయ సంపదలో వాటా కోసం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం శ్రేణులు పాటుపడాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవాడ దాసరి భవన్‌లో జరిగింది. సమావేశానికి జల్లి విల్సన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఏ ప్రభు త్వం అధికారంలోకి వచ్చినా పేదల ఆత్మగౌరవం కోసం పాటు పడటం లేదని, ఆత్మగౌరవం దక్కాలంటే భూమి పంపిణీ చేయాలని, అలాంటి ధ్యాస ప్రభుత్వాలకు లేదని అన్నారు. జాతీయ సంపద అంతా కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కావడం వల్ల పేదల శాతం రోజురోజుకు పెరిగిపోతోందని, మన ఉద్యమాలను సంక్షేమం కోసమే కాకుండా, గ్రామీణ కష్టజీవుల భవిష్యత్ తరాల బాగు కోసం, వారి అభివృద్ధి కోసం కొనసాగించాల్సిందేనని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల అమలుతోనే పేదల జీవన విధానం మారబోదని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కష్టజీవుల దగ్గరకు వెళ్లి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వంతో పాటు గ్రామ సంఘాలు ఏర్పాటు చేసి సంఘంలో వారిని భాగస్వాములు చేయాలని, ప్రతి మూడేళ్లకు ఒకసారి జరిగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా మహాసభలను రాబోయే మూడు నెలల పాటు చాలా ఘనంగా నిర్వహించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక నిరంకుశ, మతతత్వ పోకడలకు వ్యతిరేకంగా జరిగే సీపీఐ, సీపీఎం ప్రచారభేరిలో వ్యవసాయ కార్మిక సంఘం నాయ కులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభలు బాపట్లలో ఆగస్టు చివరి వారంలో నిర్వహించాలని, 10 వేల మంది గ్రామీణ కష్టజీవులతో ప్రదర్శన, భారీ బహిరంగ సభ నిర్వహించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేసి గ్రామీణ కష్టజీవులకు కుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మే మొదటి వారంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, రెవెన్యూ శాఖ మంత్రికి వినతిపత్రాలు ఇవ్వాలని సమావేశం తీర్మానించిందన్నారు.

ఈ సమావేశానికి ఆంధ్రప్ర దేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, ఏఐటీ యూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య హాజరై ప్రసంగించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఆర్.వెంకట్రావు, బి.కేశవ రెడ్డి, సి.సుబ్రహ్మణ్యం, చిలుకూరి వెంకటేశ్వరరావు, కాబోతు ఈశ్వరరావు, లండ వెంకట్రావు, కలిశెట్టి వెంకట్రావు, దగాని సంగీతరావు, టి.కిష్టప్ప, మేరుగు విజయ్ కుమార్, కృష్ణయ్య, నాగుల్ మీరా, శ్రీధర్, సుబ్బరాయుడు, ఎస్.డి.మౌలాలి, ఉప్పె నరసింహారావు, శ్రీను, కలింగ్ లక్ష్మణ్, రమణ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రిచ్ జగన్

- ఆర్థిక మంత్రి అప్పుల అప్పారావు
- మోటార్లకు మీటర్లు పెట్టడానికి వస్తే తరిమి కొట్టండి
- యువనేత నారా లోకేశ్

విశాలాంధ్ర-ప్యాపిలి : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దేశంలోని 30 మంది ముఖ్యమంత్రుల్లోనే రిచ్ అని, ఆర్థిక మంత్రి బుగ్గన అప్పుల అప్పారావు అని యువనేత నారా లోకేశ్ అన్నారు. శుక్రవారం యువగళం పాదయాత్రలో భాగంగా జరిగిన బహిరంగ సభను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ రిచ్ మోహన్ కటింగ్, ఫిట్టింగ్ మాస్టర్ అన్నారు. రెండు బటన్‌లు ఉంటాయని ఒక బటన్ నొక్కితే పది రూపాయలు ప్రజల ఖాతాలో పడతాయని, రెండో బటన్ నొక్కితే వంద రూపాయలు ఆయన ఖాతాలో పడతాయని ఎద్దేవా చేశారు. ఈ కటింగ్ మాస్టర్ అన్న క్యాంటీన్, నిరుద్యోగ భృతి, పెళ్లి కానుక, ఫీజు రీయింబర్స్‌మెంట్ కట్ చేశాడని తెలిపారు. రైతులు, మహిళలు, మైనారిటీలు, దళితులు, బీసీలను వదల్లేదని, తాము అధికారంలోకి వస్తే వారిని ఆదుకుంటామన్నారు. బీసీల కోసం ప్రత్యేక రక్షణ చట్టం చేస్తామని తెలిపారు. మోటార్లకు మీటర్లు బిగించాలని వస్తే వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోయాయని, సీఎం సొంత జిల్లాలో దళితుడైన డాక్టర్ అచ్చన్నను హత్య చేశారన్నారు. అప్పుల మంత్రి మైనింగ్, ఇసుక, భూకబ్జాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఆయనకు వ్యతిరేకంగా ఉన్న మైనింగ్ వ్యాపారులపై విజిలెన్స్ దాడులు చేయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని విమర్శించారు. డోన్ అభివృద్ధి విషయంలో రిచ్ మోహన్, అప్పుల మంత్రి చేసింది ఏమీ లేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే డోన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని, హంద్రీ-నీవా ద్వారా చెరువులు నింపుతామని అన్నారు. వైసీపీ నాయకులు పెట్టిన అక్రమ కేసులపై తమ అధికారంలోకి వచ్చిన తర్వాత జ్యుడిషియల్ విచారణ చేయిస్తామన్నారు. ఒక సంవత్సరంలో ఎన్నికలు వస్తాయని, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కోరారు.

అంబేద్కర్ భారతదేశ ఆస్తి

ఆయన ఏ వర్గానికో పరిమితం కాదు: చంద్రబాబు ఘననివాళి

విశాలాంధ్ర-గుడివాడ: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ భారతదేశ ఆస్తి అని, ఆయన ఏ వర్గానికో ప్రాంతానికో పరిమితం కాదని మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని టీడీపీ ఇన్‌చార్జి రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు వెనిగండ్ల రాము ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితో నాడు ఎన్డీఏ కన్వీనర్‌గా కేఆర్ నారాయణన్‌ను రాష్ట్రపతిగా ప్రతిపాదించానన్నారు. ప్రతిభాభారతి, జీఎంసీ బాలయోగిని శాసనసభ, లోక్‌సభ స్పీకర్లను చేశానన్నారు. దళితుల్ని, ప్రజల్ని వేధిస్తారని అంబేద్కర్‌కు తెలిసుంటే జగన్ వంటి నాయకులను అధికారంలోకి రాకుండా చేసేవారన్నారు. జగన్ పాలనలో దళితులపై ఆరు వేలకు పైగా దారుణాలు జరిగాయన్నారు. అంబేద్కర్ గురించి నేటి యువత తెలుసుకోవా లన్నారు. సాధారణ కుటుంబంలో పుట్టి అసాధారణ శక్తిగా ఎదిగిన మహానుభావుడు అంబేద్కర్ అని చెప్పారు. బడుగు, బలహీనవర్గాలు, దళితులను ఆర్థికంగా, సామాజికంగా చైతన్యవంతుల్ని చేయడానికి, ధైర్యం నూరిపోయడానికి అంబేద్కర్ మార్గాన్ని ఎంచుకొని, ఆయన బాటలోనే నడిచినట్లు స్వర్గీయ ఎన్టీఆర్ ఒక సందర్భంలో చెప్పారన్నారు. అంబేద్కర్ కేవలం ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వాడనే దురభిప్రాయాన్ని వీడాలన్నారు. మహిళలకు ఆస్తి హక్కు కావాలని అంబేద్కర్ పోరాడారని, అయినా నాటి చట్ట సభలో అది ఆమోదం పొందలేదన్నారు. నాటి అంబేద్కర్ కలను ఎన్టీఆర్ నిజం చేశారన్నారు. ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్ చైర్మన్ అయ్యాకే అంబేద్కర్‌కు భారతరత్న ఇప్పించారన్నారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, అమరావతిలో స్మృతివనం నిర్మాణానికి అంకురార్పణ చేశామన్నారు. తాము ప్రారంభించిన స్మృతివనం ప్రాజెక్టును జగన్ ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించిందన్నారు. ఒక్కఛాన్స్ అని అధికారంలోకి వచ్చి ఎస్సీలకు తీరనిద్రోహం చేసిన వ్యక్తిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. టీడీపీ హయాంలో ఎస్సీల కోసం 27 ప్రత్యేక పథకాలు అమలుచేశామని, జగన్ ముఖ్యమంత్రి కాగానే వాటన్నింటినీ రద్దుచేశారని విమర్శించారు. ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకుంటేనే ఆర్థికఅసమానతలు తగ్గుతాయన్నారు. తాను ముఖ్యమంత్రిగా ఎస్సీలకు 150 యూనిట్ల ఉచితవిద్యుత్ అందించానని, దాన్ని జగన్ రద్దు చేశారన్నారు. జగన్ ప్రభుత్వంలోనే దళితులపై దాడులు పెరిగాయన్నారు. డా.సుధాకర్ నుంచి డా.అచ్చెన్న వరకు జరిగిన ఘటనలు ఉదహరించారు. పేదలకు అండగా ఉండేది.. ఆదుకునేది తెలుగుదేశం పార్టీనేనన్నారు. అంబేద్కర్ ఆలోచనలను ఆచరణలో నిజం చేయాలన్నా... రాజ్యాంగం సమర్థవంతంగా అమలుకావాలన్నా... టీడీపీ అధికారంలోకి రావాలన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.